DD9 వార్త
తెలుగు దినపత్రిక
గురువారం, డిసెంబర్ 25, 2025

## వామన రూపుడైన
# వరాల రామయ్య

- భద్రగిరిలో వైభవోపేతంగా సాగుతున్న అధ్యయనోత్సవాలు
- నేడు పరశురామావతారంలో దర్శనం

భద్రాచలం, డిసెంబర్ 24 ( డిడి9 వార్త ) బలి చక్రవర్తి గర్వాన్ని అణిచేందుకు వెలసి మూడడుగుల స్థలాన్ని కోరి రాక్షసరాజుకు గర్వభంగం చేసిన వామనావతారంలో దర్శన మిచ్చిన భద్రాద్రి రామయ్యకు భక్తులు జేజేలు పలికారు. భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి వారి ఆలయంలో నిర్వహిస్తున్న వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాలు బుధవారం ఐదో రోజుకు చేరుకున్నాయి. ఇందులో భాగంగా సీతాలక్ష్మణ సమేతుడైన రామయ్య స్వామిని వామనావ తారంలో అలంకరించారు.



12 లో



# బస్టాండ్ అడ్డాగా బరితెగింపు



9 లో

- కూత వేటు దూరంలోనే పోలీస్ స్టేషన్
- అయినా రెచ్చిపోతున్న ఆకతాయిలు
- పోకిరాల వికృత చేష్టలు
- వేధింపులకు గురవుతున్న మహిళలు
- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు

**గంజాయి మద్యం మత్తులో పెట్రేగుతున్న పోకిరీలు**

వైరా పట్టణంలోని బస్టాండ్ రోజురోజుకీ ఆకతాయిల అడ్డాగా మారుతోందనే ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి. ఖమ్మం, హైదరాబాద్, భద్రాచలం, కొత్తగూడెం, మధిర వంటి కీలక పట్టణాలకు రాకపోకలు సాగించే ప్రధాన కేంద్రంగా ఉన్న ఈ బస్టాండ్‌లో ప్రతిరోజూ వందల సంఖ్యలో బస్సులు రాకపోకలు కొనసాగిస్తుండగా, వేలాది మంది ప్రయాణికులు ఈ మార్గం ద్వారా తమ గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు ప్రయాణికుల తాకిడి అధికంగా ఉండే ఈ ప్రాంతం భద్రతా పరంగా మాత్రం ప్రశ్నార్థకంగా మారింది. గత కొన్ని నెలలుగా బస్టాండ్‌లో ఆకతాయిల ఆగడాలు హద్దులు దాటుతున్నాయని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా సాయంత్రం వేళల నుంచి రాత్రి వరకు కొందరు యువకులు బస్టాండ్‌కు చేరుకొని పోకిరితనంతో ప్రవర్తిస్తూ మహిళలు, విద్యార్థినులను వేధిస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలేజీలు, పాఠశాలల నుంచి తిరిగివచ్చే ఆడపిల్లలతో అసభ్యంగా మాట్లాడటం, బస్సు ఎక్కే సమయంలో రద్దీని ఆసరాగా చేసుకొని తాకడం, వెకిలి చేష్టలతో ఇబ్బంది పెట్టడం వంటి ఘటనలు నిత్యకృత్యంగా మారినట్లు చెబుతున్నారు.

-వైరా క్రైమ్, (డిడి9 వార్త)

# మేడారంలో గద్దెల పండుగ



- సమ్మక్క గుడి నుంచి గద్దెల వరకు డోలివాయిద్యాల శోభ
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- పటిష్టమైన పోలీస్ భద్రత ఏర్పాట్లు
- పూజారుల సంఘం అధ్యక్షుడు జగ్గరావు ఆధ్వర్యంలో నిర్వహణ
- డోలివాయిద్యాలతో మార్మోగిన మేడారం
- పగిడిద్దరాజు గద్దెపై పెనకవంశస్తులు పూజలు
- గోవిందరాజు గద్దెపై కాకవంశస్తుల పూజలు
- కొత్తగా నిర్మించిన గద్దెల ప్రారంభంతో తొలి ఘట్టం పూర్తి
- గద్దెల పండుగకు హాజరైన మంత్రి సీతక్క
- మేడారంలో భక్తుల మొక్కులతో మార్మోగిన అడవిబాటలు

3 లో

## మేడారంలో పోలీసు కమిషనర్ మొక్కులు

- ములుగు నుంచి పస్రా తాడ్వాయి, మీదుగా జాతర సందర్శన
- గద్దెల పనుల పరిశీలన, చరిత్ర కట్టడాలు బాగున్నాయి
- ఆదివాసి సంప్రదాయం సంస్కృతి ఎంతో బాగుంది
- సమ్మక్క-సారలమ్మలకు పూజలు

12 లో



## అట్రాసిటీ కేసులకు వేగవంతంగా
# పరిష్కరించాలి

- బాధితులకు తక్షణ న్యాయం లక్ష్యం : జితేష్ వి. పాటిల్
- ఎస్సీ, ఎస్టీ యువతకు ఉపాధి శిక్షణపై ప్రత్యేక దృష్టి

7 లో





## భద్రాచలంలో
# దారుణం

- భార్యపై భర్త కత్తితో విచక్షణారహిత దాడి
- గొంతు కోసి, పొట్టలో పొడిచిన కిరాతకుడు.
- కొడుకు ముందే తండ్రి దారుణం
- సమయస్ఫూర్తితో ఎమర్జెన్సీగా ఆపరేషన్ చేసి ప్రాణాలు కాపాడిన సూపర్డెంట్ డా. రామకృష్ణ
- డాక్టర్ ముదిగొండ రామకృష్ణపై సర్వత్రా ప్రశంసలు

2 లో

భద్రాచలం పట్టణంలో బుధవారం సాయంత్రం చోటుచేసుకున్న ఓ ఘటన స్థానికులను ఉలిక్కిపడేలా చేసింది. పాత మార్కెట్ రోడ్డులో భార్యపై ఓ భర్త కత్తితో విచక్షణారహితంగా దాడి చేసి, ప్రాణాలతో బలిగొనే ప్రయత్నం చేశాడు. తల్లీకొడుకుల ముందే ఈ ఘాతుకానికి పాల్పడటం తీవ్ర కలకలం రేపింది.

భద్రాచలం, (డిడి9 వార్త)

# భద్రాచలంలో దారుణం

**భద్రాచలం, డిసెంబర్ 24 (డిడి9 వార్త)** భద్రాచలం పట్టణంలో బుధవారం సాయంత్రం చోటుచేసుకున్న ఓ ఘటన స్థానికులను ఉలిక్కి పడేలా చేసింది. పాత మార్కెట్ రోడ్డులో భార్యపై ఓ భర్త కత్తితో విచక్షణారహితంగా దాడి చేసి, ప్రాణాలతో బలిగొనే ప్రయత్నం చేశాడు. తల్లీకొడుకుల ముందే ఈ ఘాతుకానికి పాల్పడటం తీవ్ర కలకలం రేపింది. వివరాల్లోకి వెళ్తే.. దుమ్ముగూడెం మండలం పులిగుండాల గ్రామానికి చెందిన సోడి సత్యం, సోడి లక్ష్మి దంపతుల మధ్య గత కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. దీంతో లక్ష్మి గత ఐదు నెలలుగా భద్రాచలంలోని తన బంధువుల ఇంట్లో ఉంటోంది. ఈ దంపతులకు ముగ్గురు పిల్లలు కాగా, పెద్ద కుమారుడు ఖమ్మంలో చదువుకుంటున్నాడు. సెలవుల నిమిత్తం కుమారుడిని ఇంటికి తెచ్చిన లక్ష్మి, అతనికి బట్టలు కొనిచ్చేందుకు బుధవారం బయటకు వచ్చింది.



### నమ్మించి తీసుకెళ్లి.. నడిరోడ్డుపై దాడి

బయట తారసపడిన భర్త సత్యం, బట్టలు కొనిస్తానని నమ్మించి వారిని తన బైక్‌పై ఎక్కించుకున్నాడు. అయితే బట్టల షాపునకు వెళ్లకుండా నిర్మానుష్య ప్రాంతాల వైపు తిప్పుతుండటంతో అనుమానం వచ్చిన లక్ష్మి, బైక్ మీద నుండి ఒక్కసారిగా కిందకు దూకేసింది. ఆగ్రహంతో ఊగిపోయిన సత్యం, తన వద్ద ఉన్న కత్తితో కొడుకు ముందే లక్ష్మి గొంతు కోసి, పొట్టలో బలంగా పొడిచాడు. తీవ్ర రక్తస్రావంతో విలవిలలాడుతున్న లక్ష్మిని చూసి చుట్టుపక్కల వారు అడ్డుకోవడంతో సత్యం అక్కడి నుండి పరారయ్యాడు.

### దేవుడిలా కాపాడిన ప్రభుత్వ వైద్యులు

స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌కు సమాచారం అందించగా, క్షతగాత్రురాలిని భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో డ్యూటీ డాక్టర్లు గోపాలకృష్ణ, ప్రశాంత్ లు వెంటనే హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ ముదిగొండ రామకృష్ణకు సమాచారం అందించారు. సమాచారం అందిన వెంటనే స్పందించిన డాక్టర్ రామకృష్ణ, బాధితురాలిని పరీక్షించి అత్యవసరంగా ఆపరేషన్ థియేటర్‌కు తరలించారు. పొట్టలో అంతర్గత అవయవాలకు గాయాలైనప్పటికీ, యుద్ధ ప్రాతిపదికన శస్త్రచికిత్స నిర్వహించి లక్ష్మి ప్రాణాలను కాపాడారు.

### ప్రభుత్వ వైద్యంపై పెరిగిన నమ్మకం పెంచుతున్న సూపర్డెంట్ డాక్టర్ ముదిగొండ రామకృష్ణ

ప్రస్తుతం బాధితురాలు ఐసీయూలో చికిత్స పొందుతుంది. అత్యవసర సమయంలో స్పందించి ప్రాణాలు కాపాడిన డాక్టర్ ముదిగొండ రామకృష్ణకు, వారి వైద్య బృందానికి బాధితురాలి బంధువులు కన్నీటితో కృతజ్ఞతలు తెలిపారు. కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అందడంపై పట్టణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సంఘటన తెలుసుకున్న పోలీసులు పట్టణ ఎస్ఐ స్వప్న ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకొని ఘటన వివరాలు తెలుసుకున్నారు. అనంతరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.



## గోలివాడ సమ్మక్కసారాలమ్మ గద్దల పునర్నిర్మాణ పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్

**అంతర్గాం, పాలకుర్తి రిపోర్టర్, (డి డి 9 వార్త )** పెద్దపల్లి జిల్లా అంతర్గ మండలం గో లివాడ సమ్మక్క-సారలమ్మ గద్దెల పునర్నిర్మాణ పనులను రామగుండం శాసనసభ్యులు రాజ్ ఠాగూర్ ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా రామగుండం శాసనసభ్యులు రాజ్ ఠాగూర్ మాట్లాడుతూ పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో చర్చించారు. ప్రజల విశ్వాసాలకు, సంప్రదాయాలకు అనుగుణంగా నాణ్యమైన నిర్మాణ పనులు చేపట్టాలని అధికారులకు సూచనలు చేశారు.అక్కడి సౌకర్యాలు, నిర్వహణ అంశాలను పరిశీలించి అవసరమైన అభివృద్ధి పనులు తక్షణమే చేపడతామని, జాతరకు వచ్చే భక్తులకు, ఎలాంటి ఇబ్బంది లేకుండా సమ్మక్క -సారలమ్మ తల్లి పూజ చేసుకోవడానికి ప్రజలకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించి ఆ వనదేవతల దర్శనం చేసుకునే విధంగా దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండే విధంగా జాతర కమిటీ సభ్యులకు విన్నవిస్తూ నేను సైతం దగ్గర ఉండి ఏర్పాట్లను చూసుకుంటానని రామగుండం శాసనసభ్యులు రాజ్ ఠాగూర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి 'పీసా' మహోత్సవాల్లో భద్రాచలం ఐటీడీఏ సత్తా

**భద్రాచలం, డిసెంబర్ 24 (డిడి9 వార్త)** భారత ప్రభుత్వ పంచాయతీరాజ్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో విశాఖపట్నంలో నిర్వహించిన జాతీయ స్థాయి 'పీసా' మహోత్సవాల్లో భద్రాచలం ఐటీడీఏ క్రీడాకారులు అద్భుత ప్రతిభ కనబరిచారు. పురుషుల కబడ్డీ పోటీల్లో భద్రాచలం జట్టు జాతీయ స్థాయిలో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. ఈ విజయం పట్ల ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ హర్షం వ్యక్తం చేస్తూ క్రీడాకారులను ప్రత్యేకంగా అభినందించారు. విశాఖపట్నంలోని అక్కయ్యపాలెం పోర్టు స్టేడియంలో మూడు రోజుల పాటు జరిగిన ఈ ఉత్సవాలు బుధవారం ముగిశాయి. ముగింపు వేడుకల్లో భాగంగా కేంద్ర పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి వివేక్ భరద్వాజ్, డైరెక్టర్ రమిత్ మౌర్య, ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ శశిభూషణ్ కుమార్ చేతుల మీదుగా భద్రాచలం కబడ్డీ జట్టు సభ్యులు కాంస్య పతకాన్ని, 50 వేల రూపాయల నగదు పారితోషికాన్ని అందుకున్నారు. భద్రాచలం ఐటీడీఏ తరపున ఏపీఓ (జనరల్) మరియు స్పెషల్ ఆఫీసర్ డేవిడ్ రాజ్ ఈ పురస్కారాన్ని స్వీకరించారు.

### గిరిజన వంటకాలు, కోయా క్రాఫ్ట్ కు విశేష స్పందన.

ఈ మహోత్సవంలో పది రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రతినిధులు భద్రాచలం ఐటీడీఏ ఏర్పాటు చేసిన గిరిజన వంటకాల స్టాల్‌ను సందర్శించారు. గిరిజన సంప్రదాయ రుచులను ఆస్వాదించడంతో పాటు, కోయా క్రాఫ్ట్ వస్తువుల తయారీని చూసి ముగ్ధులయ్యారని పీఓ తెలిపారు. స్టాల్‌లోని హస్తకళా రూపాలను విదేశీ ప్రతినిధులు సైతం ఆసక్తిగా కొనుగోలు చేయడం విశేషం. కార్యక్రమంలో ఐటీడీఏ ఏఓ సున్నం రాంబాబు, ట్రైబల్ వెల్ఫేర్ స్పోర్ట్స్ ఆఫీసర్ జ్యోతి, పి.ఆర్.డి.డి సుభాష్ చంద్ర గౌడ్, కొండ్రు సుధారాణి, శీలం దుర్గ, గుండి లత, నిఖిల్, పాయం కృష్ణమూర్తి మరియు క్రీడాకారులు పాల్గొన్నారు. క్రీడల్లో రాణించిన ప్రతి ఒక్కరికీ ప్రశంసా పత్రాలను అందజేశారు.




# క్రిస్మస్ వేడుకలకు చర్చిలు ముస్తాబు

### ★ నేడు యేసుక్రీస్తు జన్మదినం

**మంథని, డిసెంబర్ 24 (డిడి 9 వార్త):** యేసుక్రీస్తు జన్మదినం సందర్భంగా క్రైస్తవులు జరుపుకునే అతిపెద్ద పండుగ క్రిస్మస్ ప్రపంచ వ్యాప్తంగా జరుపుకునే ఈ పండుగను అంగరంగ వైభవంగా క్రైస్తవ సోదరులు జరుపుకునే పండుగ ఇది. క్రైస్తవులు దీన్ని ఎంతో పవిత్రంగా భావిస్తారు. యేసుక్రీస్తు జన్మించి దాదాపు రెండువేల ఇరవై ఐదు సంవత్సరాలు దాటిన ఆయన కరుణామయునిగా, దయామయునిగా ఆయన క్రైస్తవుల ఆరాదనలు అందుకుంటున్నారు. డిసెంబర్ మొదటివారం నుంచి క్రైస్తవుల గృహాలలో, చర్చిలలో క్రిస్మస్ సందడి నెలకొంటుంది. ప్రపంచ వ్యాప్తంగా డిసెంబర్ 25న క్రైస్తవులు ఘనంగా నిర్వహించుకునే యేసుక్రీస్తు పుట్టిన రోజు పండుగ క్రిస్మస్ వేడుకలను జరుపుకునేందుకు మంథని డివిజన్ పరిధిలోని క్రైస్తవులు సిద్ధమయ్యారు. డివిజన్ కేంద్రంలోని సీయోను చర్చి, ఆర్.సీ.ఎం, బేతేలు ప్రార్థన మందిరం, గ్లోరియస్ ప్రార్థన మందిరం చర్చిలతో పాటు ఎక్లాస్ పూర్, శ్రీరామ్ నగర్, ధర్మారం, బిట్టుపల్లి, గాజులపల్లి, తోటగోపయ్య పల్లి, దుబ్బపల్లి, మల్లారం, సిరిపురం గ్రామల్లోని చర్చిలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. క్రైస్తవుల ఇళ్లపై, చర్చిలపై క్రిస్మస్ ట్రీలు, నక్షత్రాలు ఏర్పాటు చేయడంతో చూపరులను ఆకట్టు కుంటున్నాయి. క్రైస్తవుల్లో ప్రతి ఇంటి పైన నక్షత్రం గుర్తును పోలిన స్టార్లను క్రిస్మస్ ట్రీలను ఏర్పాటు చేసుకున్నారు. డివిజన్ పరిధిలోని పలు చర్చిలలో 24న అర్ధరాత్రి నుంచే ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. డిసెంబర్ 25న చర్చిలలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేసి పండుగను సంబరంగా జరుపుకుంటారు. ఈ వేడుకలు 25 క్రిస్మస్ పండుగతో ప్రారంభమై 30, 31న ఉపవాస కూడికలు నిర్వహించి జనవరి 1న నూతన సంవత్సర వేడుకలతో ముగుస్తాయి.

### విద్యుత్ దీపాలతో అలంకరణ... సంబరంగా వేడుకలు....

క్రిస్మస్ కు పది రోజుల ముందు నుంచే క్రైస్తవులు ఇంటిపై నక్షత్రం స్టార్ ఏర్పాటు చేసుకుంటారు. చర్చిల్లో కూడా పెద్ద స్టార్లు, క్రిస్మస్ ట్రీలు, పశువుల పాకలతో పాటు వివిధ అలంకరణలతో చర్చిలను అందంగా తీర్చిదిద్దుతారు. ఈ నేపథ్యం లో మార్కెట్లో క్రిస్మస్ ట్రీలు, స్టార్స్, శాంతాక్లాస్, డ్రెస్ లకు డిమాండ్ పెరిగింది. సంవత్సరం క్రైస్తవ సోదరులు పెద్ద ఎత్తున క్రిస్మస్ వేడుకలు జరుపుకుంటున్నారని వ్యాపారులు చెబుతున్నారు. అలాగే బేకరీలకు కూడా క్రిస్మస్ కేక్ లకోసం పెద్ద ఎత్తున ఆర్డర్లు వస్తున్నట్లు బేకరీ యాజమానులు తెలిపారు. ఈ స్టార్స్ కు భారీగా డిమాండ్ ఏర్పడింది. క్రీస్తు పుట్టుకను సూచించే నక్షత్ర నమునాను ఇళ్లపై అమర్చుకోని, క్రీస్తును తమ నివాసంలోకి ఆహ్వానిస్తున్నట్లుగా క్రైస్తవ సోదరులు భారీ ఎత్తున పండుగను సంబరంగా జరుపుకుంటారు.

### డిసెంబర్ మొదటి వారం నుండే క్యారల్స్ సందడి ....

ప్రతి సంవత్సరం క్రైస్తవులు డిసెంబర్ మొదటి వారం నుండి చివరి వారం వరకు ప్రతి ఇంటికి తిరుగుతూ పిల్లలకు బహుమతులు, చాకోలేట్స్ పంచుతూ సంబరంగా జరుపుకునే విధానాన్ని క్యారల్స్ సందడి అని అంటారు. అనేక సంవత్సరాలుగా ఆనవాయితీగా వస్తోంది.

### యేసుక్రీస్తు దీవెనలు ప్రతీ ఒక్కరిపై ఉండాలి
### ఇంటర్నేషనల్ మిషన్స్ ఇండియా ప్రధాన కార్యదర్శి అంకరి కుమార్

ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడాది వేడుకలను ప్రభుత్వం నిర్వహించడం సంతోషంగా ఉంది. క్రైస్తవుల ఆరాధ్యుడు యేసుక్రీస్తు దీవెనలు ప్రతి ఒక్కరిపైన ఉండాలి. ఆయన ఆశీర్వాదంతో తెలంగాణ రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉండాలి. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజల మనోభావాలను గుర్తించి ప్రభుత్వం అధికారకంగా హిందు, ముస్లిం, క్రైస్తవుల పండుగలను అధికారికంగా నిర్వహిస్తోంది. ఆయా సామాజిక వర్గాల్లోని పేదలకు అవసరమైన సాయం అందిస్తూ ప్రతి కుటుబంలో పండుగ వాతావరణం కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు కృతజ్ఞతలు. మంథని నియోజకవర్గం లోని అన్ని చర్చిలలో క్రిస్మస్ పండుగను ఘనంగా జరుపుకోవడానికి అన్ని ఏర్పాట్లు చేసుకున్నామని ఇంటర్నేషనల్ మిషన్స్ ఇండియా ప్రధాన కార్యదర్శి అంకరి కుమార్ తెలిపారు.





# మేడారంలో ఘనంగా గద్దెల పండుగ

- డోలివాయిద్యాలతో మార్మోగిన మేడారం
- పూజారుల సంఘం అధ్యక్షుడు జగ్గరావు ఆధ్వర్యంలో నిర్వహణ
- పగిడిద్దరాజు గద్దెపై పెనకవంశస్తులు పూజలు
- గోవిందరాజు గద్దెపై కాకవంశస్తుల పూజలు
- సమ్మక్క గుడి నుంచి గద్దెల వరకు డోలివాయిద్యాల శోభ
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు – పటిష్టమైన పోలీస్ భద్రత ఏర్పాట్లు
- కొత్తగా నిర్మించిన గద్దెల ప్రారంభంతో తొలి ఘట్టం పూర్తి
- గద్దెల పండుగకు హాజరైన మంత్రి సీతక్క
- మేడారంలో భక్తుల మొక్కులతో మార్మోగిన అడవిబాటలు

**ఏటూరునాగారం (క్రైమ్),డిసెంబర్ 24,(డీడీ9 వార్త):**

కోట్లాది మంది భక్తుల కోరికలు తీర్చే మహిమాన్వితమైన మేడారం దేవతల గద్దెల పండుగ బుధవారం అంగరంగ వైభవంగా జరిగింది. పూజారుల సంఘం అధ్యక్షుడు జగ్గరావు ఆధ్వర్యంలో సంప్రదాయబద్ధంగా ఈ పండుగను నిర్వహించారు. మొదటగా సమ్మక్క గుడిలో పూజలు, మొక్కుబడులు నిర్వహించిన అనంతరం డోలివాయిద్యాల నడుమ పూజాసామగ్రితో గద్దెల వద్దకు చేరుకున్నారు. గ్రామ ప్రజలు లేవక ముందే పగిడిద్దరాజు, గోవిందరాజు గద్దెలపై దేవతల ప్రతిమలను ప్రతిష్టించారు. ఉదయం 8 గంటలకు గోవిందరాజు గద్దెపై కొండాయి గ్రామానికి చెందిన కాకవంశస్తులు పూజారులు ప్రతిమను ప్రతిష్టించగా, 10 గంటలకు పగిడిద్దరాజు గద్దెపై పూనుగొండ్ల గ్రామానికి చెందిన పెనకవంశస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దూప-దీప-నైవేద్యాలతో పూజలు సాగి, పూజారులు మొక్కులు సమర్పించారు. గద్దెలపై పూజలు భక్తులకు కనులపండుగగా నిలిచాయి.

**ఓ వైపు పూజలు...**
**మరో వైపు భక్తులు...!!**

గద్దెల పండుగ సందర్భంగా మేడారం ప్రాంతమంతా భక్తులతో కిటకిటలాడింది. వేలాది మంది భక్తులు తరలిరావడంతో పోలీసులు పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. పస్రా సీఐ దయాకర్ ఆధ్వర్యంలో తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డితో పాటు పోలీసు బలగాలు మోహరించాయి. గద్దెల చుట్టూ భద్రతా వలయం ఏర్పాటు చేశారు.

**ఈ కార్యక్రమంలో**

- పగిడిద్దరాజు పూజారులు - పూనుగొండ్లకు చెందిన 15 మంది పెనకవంశస్తులు,
- గోవిందరాజు పూజారులు - కొండాయి గ్రామానికి చెందిన 11 మంది కాకవంశస్తులు,
- కన్నెపల్లి నుంచి సారలమ్మ పూజారులు కాకసారయ్య ఆధ్వర్యంలో,
- సమ్మక్క పూజారులు గద్దెల ప్రాంగణంలో పూజాకార్యక్రమాల్లో నిమగ్నమయ్యారు.

**గద్దెల ప్రారంభంతో తొలి ఘట్టం**

మేడారంలో కొత్తగా నిర్మించిన గద్దెల ప్రారంభంతో ఈ పండుగ తొలి ఘట్టం పూర్తయింది. గద్దెల పండుగకు ముందుగా సుమారు 20 రోజుల క్రితం మండెమెలిగే పండుగను సమ్మక్క-సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు పూజారులు సంప్రదాయబద్ధంగా నిర్వహిస్తారు. ఆ రోజు ఊరంతా పండుగ వాతావరణం నెలకొంటుంది. గద్దెల ప్రారంభం రోజున పూజారులతో పాటు ఐదుగురు ముత్తైదువలు ఉపవాసంతో పాల్గొన్నారు. మేడారం, కొత్తగూడెం మండలం, పూనుగొండ్ల, కొండాయి గ్రామాల నుంచి పెద్ద ఎత్తున గిరిజనులు, పెద్దలు తరలివచ్చి దేవతలకు మొక్కులు చెల్లించారు.

**గద్దెల ప్రతిష్ఠకు మంత్రి సీతక్క**

గద్దెల పండుగ సందర్భంగా మంత్రి సీతక్క బుధవారం మేడారాన్ని సందర్శించారు. గిరిజన పూజారులు నిర్వహించిన గద్దెల పండుగలో పాల్గొని దేవతలకు మొక్కులు సమర్పించారు. గిరిజన సంప్రదాయాల నడుమ అంగరంగ వైభవంగా నిర్వహించిన ఈ పండుగ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.

---

## నూతన సర్పంచ్‌గా బాధ్యతలు స్వీకరించిన కాకులమర్రి శ్రీలత

- ఏటూరు నాగారం ప్రజల రుణం తీర్చుకుంటా

**డీ డీ 9 వార్త, ములుగు బ్యూరో :**

ఏటూర్ నాగారం మండల పరిధిలోని గ్రామ సర్పంచ్‌గా శ్రీమతి కాకులమర్రి శ్రీలత బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో వేద పండితుల ఆశీర్వచనాల నడుమ ఆమె తన పదవిని అలంకరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీలత మాట్లాడుతూ, తన గెలుపుకు సహకరించిన గ్రామ ప్రజలకు, నాయకులకు మరియు కార్యకర్తలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలు నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, ఏటూరు నాగారం గ్రామాన్ని మండలంలోనే అగ్రగామిగా నిలిపేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఆమె ప్రకటించారు.

**ముఖ్య ప్రణాళికలు:**

గ్రామంలో పరిశుభ్రత మరియు పారిశుధ్యానికి ప్రథమ ప్రాధాన్యత. ప్రతి ఇంటికి సురక్షితమైన త్రాగునీరు అందేలా చర్యలు. మెరుగైన డ్రైనేజీ వ్యవస్థ మరియు వీధి దీపాల ఏర్పాటు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా పారదర్శక పాలన. అనంతరం గ్రామంలోని పలువురు ప్రముఖులు, వార్డు సభ్యులు మరియు గ్రామ ప్రజలు ఆమెను శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు గ్రామపంచాయతీ కార్యదర్శి, వార్డు మెంబర్లు మరియు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కార్యకర్తలు గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





## భాద్యతా యుతంగా సేవలు అందించాలి

**భూపాలపల్లి డిసెంబర్ 24 ( డిడి 9 వార్త )**



పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రజలకు పారదర్శకమైన సేవలను అందిస్తూ బాధ్యతతో విధులు నిర్వహించాలని ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ అన్నారు. బుధవారం నాడు ఆయన భూపాలపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.జిల్లాలో పోలీస్ వ్యవస్థ పనితీరు, ప్రజలకు అందుతున్న సేవలపై ప్రత్యక్ష అవగాహన పొందే ఉద్దేశంతో ఆయన భూపాలపల్లి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి పోలీస్ స్టేషన్ ప్రాంగణం, పరిసరాల శుభ్రత, రికార్డుల నిర్వహణ, సిబ్బంది విధి నిర్వహణ విధానం తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించారు.

ప్రజలు పోలీస్ స్టేషన్‌కు వచ్చినప్పుడు స్నేహపూర్వక వాతావరణం కల్పించడంతో పాటు, త్వరిత న్యాయం, పారదర్శక సేవలు అందేలా ప్రతి పోలీస్ సిబ్బంది బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు.

శాంతి భద్రతల పరిరక్షణతో పాటు ప్రజల విశ్వాసాన్ని పెంపొందించే విధంగా విధులు నిర్వహించడమే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. ఆయన వెంట డీఎస్పీ సంపత్ రావ్, సిఐ నరేష్ కుమార్ తదితరులు ఉన్నారు.

## కేజీబీవీ లో వీర్ బాల్ దివస్ వ్యాసరచన పోటీలు

**మొగుళ్లపల్లి డిసెంబర్ 24 ( డిడి 9 వార్త )**

భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయ (కేజీబీవీ) హై స్కూల్లో వీర్ బాల్ దివస్ ని పురస్కరించుకొని బుధవారం నాడు వ్యాసరచన పోటీలు నిర్వహించారు.

కలెక్టర్ రాహుల్ శర్మ ఆదేశాల మేరకు, జిల్లా సంక్షేమ అధికారి మల్లీశ్వరి సూచనలతో ఈ కార్యక్రమం నిర్వహించారు. . కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ చైతన్య వీర్ బాల్ దివాస్ యొక్క చారిత్రక ప్రాధాన్యతను విద్యార్థినీలకు తెలియజేయడం, బాలికలలో ధైర్యం, దేశభక్తి, త్యాగ భావనలను పెంపొందించడమే లక్ష్యంగా ఈ పోటీలు నిర్వహించడం జరిగింది అని తెలిపారు. మహిళ సాధికారత కో ఆర్డినటర్ క్రిష్ణ మాట్లాడుతూ

పోటీల్లో విద్యార్థినీలు ఉత్సాహంగా పాల్గొనాలని, దేశసేవ, విద్య విలువ, మహిళా సాధికారత, భేటీ బచావో భేటీ పడావో వంటి వాటి గురించి వివరించారు. ఈ కార్యక్రమం విద్యార్థినీలలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంలో కీలకంగా నిలిచిందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో అధ్యాపకురాలు జమున, మహిళా సాధికారత సిబ్బంది సురేష్ తదితరులు పాల్గొన్నారు.





## జిల్లా ప్రజలకు క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు

**భూపాలపల్లి డిసెంబర్ 24 ( డిడి 9 వార్త )**


ఏసుక్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకుని జరుపుకునే క్రిస్మస్ పండుగ క్రైస్తవులకు అత్యంత పవిత్రమైన పండుగని కలెక్టర్‌రాహుల్ శర్మ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఏసుక్రీస్తు బోధనలు ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని, ప్రేమను పంచుకోవడం, సేవాభావంతో మానవత్వాన్ని కాపాడుకోవడం ఎలా అన్న విషయాలను క్రీస్తు బోధనలు తెలియచేస్తాయని ఆయన అన్నారు. జిల్లా ప్రజలంతా క్రిస్మస్ పండుగను ఘనంగా జరుపుకోవాలని, పరస్పర సౌహార్దంతో, శాంతియుత వాతావరణంలో వేడుకలు నిర్వహించాలని సూచించారు. జిల్లా ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఆనందంగా జీవించాలని, ప్రజలకు ఏసుక్రీస్తు దీవెనలు ఉండాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

## డిగ్రీ విద్యార్తినిలకు వ్యాస రచన పోటీలు

**భూపాలపల్లి డిసెంబర్ 24 ( డిడి 9 వార్త )**

డిగ్రీ విద్యార్థినులకు రాష్ట్ర స్థాయిలో వ్యాస రచన పోటీలు నిర్వహిస్తున్నట్టు తెలంగాణ డిగ్రీ కళాశాలల బిసి అధ్యాపకుల సంఘం ప్రతినిధులు నంద కుమార్, బాల శ్రీనివాస్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. భారత దేశ తొలి ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త, సామాజికవేత్త, రచయిత్రి, మహాసాధ్వి మాతా సావిత్రి బాయి పూలే 195 వ జయంతి వేడుకలను పురస్కరించుకొని ఈ నెల 28 న సి.యస్.బి.ఐ.ఎ.యస్. అకాడమీ గాంధినగర్, ఆర్.టి.సి. క్రాస్, హైద్రాబాద్ లో మాతా సావిత్రి భాయి పూలే జీవిత చరిత్ర నేటి సమాజానికి అన్వయింపు అనే అంశం పై రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీలను నిర్వహిస్తున్నట్టు వారు తెలిపారు. తెలంగాణా రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న విద్యార్థిని లు మాత్రమే పోటిలకు అర్హులని అన్నారు. పోటిల్లో విజేతలకు ప్రథమ బహుమతి 50 వేలు, ద్వితీయ బహుమతి 25 వేలు, తృతీయ బహుమతి 15వేలతో పాటు అయిదుగురికి 5వేల చొప్పున ప్రోత్సహక బహుమతులు ఇవ్వనున్నట్టు తెలిపారు.

వచ్చే నెల 3న సావిత్రి బాయి జయంతి వేడుకలను కాట్రగడ్డ శ్రీనివాస రావు మెమోరియల్ హాల్, సుందరయ్య విజ్ఞాన కేంద్రం, బాగ్ లింగంపల్లి, హైదరాబాద్ లో నిర్వహిస్తామన్నారు. పోటిల్లో పాల్గొనే వారు 94928 83648, 94915 95813, 84669 75572 నెంబర్ లను సంప్రదించాలని కోరారు. పోటీలు పుట్ట లింగమ్మ చారిటేబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంథని మాజీ శాసన సభ్యుడు పుట్ట మధుకర్ సౌజన్యం తో నిర్వహిస్తున్నట్టు వారు తెలిపారు.




# చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

## -జిల్లా రెవెన్యు అదనపు కలెక్టర్ కె.అనిల్ కుమార్

**డి డి 9 వార్త మహబూబాబాద్ జిల్లా బ్యూరో డిసెంబర్ 24:**

వినియోగ దారులు తమ హక్కులు, బాధ్యతలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా రెవెన్యు అదనపు కలెక్టర్ కె.అనిల్ కుమార్ అన్నారు. బుధవారం జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కలెక్టరేట్ లోని ప్రధాన సమావేశ మందిరంలో జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా డిజిటల్ న్యాయ వ్యవస్థ ద్వారా త్వరితగతిన సమర్థవంతంగా కేసుల పరిష్కారం అనే అంశంపై చర్చించారు. వినియోగదారుల చట్టాలపై ప్రజల్లో విస్తృత చైతన్యం తీసుకురావాలని పౌరసరఫరాల శాఖ, తూనికలు,కొలతల శాఖ అధికారులను ఆదేశించారు. ఎక్కడైనా అన్యాయం జరిగితే న్యాయం జరిగేందుకు జాతీయ వినియోగదారుల సంస్థ పనిచేస్తుందని, "డిజిటల్ న్యాయ వ్యవస్థ ద్వారా త్వరితగతిన, సమర్ధవంతంగా కేసుల పరిష్కారం. అవుతుందని, డిజిటల్ న్యాయ వ్యవస్థలు సాంకేతికత మరియు వినూత్న పద్ధతులను ఏకీకృతం చేయడం ద్వారా సామర్థ్యాన్ని పెంచి, కేసుల పరిష్కారాన్ని వేగవంతం చేస్తూ న్యాయ రంగాన్ని రూపాంతరం చెందిస్తున్నాయన్నారు.



**డిజిటల్ న్యాయంలో సాంకేతికత పాత్ర:**

డిజిటల్ న్యాయం న్యాయ ప్రక్రియలను క్రమబద్ధీకరించడానికి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI), మెషిన్ లెర్నింగ్ (ML) మరియు ఆప్టికల్ క్యారెక్టర్ రికగ్నిషన్ (OCR) వంటి వివిధ సాంకేతిక పరిజ్ఞానాలను ఉపయోగించుకుంటుంది.

ఈ సాంకేతికతలు కేసు నిర్వహణ, చట్టపరమైన పరిశోధన మరియు డాక్యుమెంటేషన్ను ఆటోమేట్ చేయడంలో సహాయపడతాయి, కేసు పరిష్కారానికి అవసరమైన సమయాన్ని గణనీయంగా తగ్గిస్తాయి. ఉదాహరణకు, AI సంభావ్య జాప్యాలను అంచనా వేయగలదు మరియు సంబంధిత తీర్పులను సంగ్రహించడం ద్వారా సమాచారంతో కూడిన నిర్ణయాలు తీసుకోవడంలో న్యాయమూర్తులకు సహాయపడుతుందని అన్నారు.

**డిజిటల్ న్యాయ వ్యవస్థల ప్రయోజనాలు:**

పెరిగిన సామర్థ్యం డిజిటల్ సాధనాలు సాధారణ పనులను ఆటోమేట్ చేయడం ద్వారా కేసుల వేగవంతమైన ప్రాసెసింగ్ను సులభతరం చేస్తాయి, ఇది న్యాయ నిపుణులు మరింత సంక్లిష్టమైన సమస్యలపై దృష్టి పెట్టడానికి వీలు కల్పిస్తుంది. ఇది కేసులు పెండింగ్లను తగ్గించడానికి మరియు వేగవంతమైన పరిష్కారాలకు దారితీస్తుందని అన్నారు.. యాక్సెసిబిలిటీ :

వర్చువల్ కోర్టులు మరియు ఆన్లైన్ ప్లాట్ఫారమ్లు న్యాయ వ్యవస్థను ప్రజలకు మరింత అందుబాటులోకి తెస్తాయి. వ్యక్తులు ఎక్కడి నుండైనా కేసులు దాఖలు చేయవచ్చు, విచారణలకు హాజరు కావచ్చు మరియు చట్టపరమైన సమాచారాన్ని యాక్సెస్ చేయవచ్చు, తద్వారా భౌగోళిక అడ్డంకులను తొలగించవచ్చని అన్నారు. పారదర్శకత : డిజిటల్ న్యాయం కోర్టు కార్యకలాపాలను ప్రత్యక్ష ప్రసారం చేయడం మరియు కేసు రికార్డులను డిజిటలైజేషన్ చేయడం ద్వారా పారదర్శకతను ప్రోత్సహిస్తుంది. ఈ బహిరంగత న్యాయ వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని పెంపొందించడంలో సహాయపడుతుందన్నారు..

**ఖర్చు-సమర్థత :**

భౌతిక మౌలిక సదుపాయాలు మరియు వ్యక్తిగత విచారణల అవసరాన్ని తగ్గించడం ద్వారా, డిజిటల్ న్యాయ వ్యవస్థలు కోర్టులు మరియు న్యాయవాదులకు ఒకే విధంగా కార్యాచరణ ఖర్చులను తగ్గించగలవని అన్నారు.

కేసులను సమర్థవంతంగా,త్వరగా పరిష్కరించడానికి న్యాయ వ్యవస్థలో డిజిటల్ టెక్నాలజీల ఏకీకరణ చాలా అవసరం. అధికార పరిధులు ఈ ఆవిష్కరణలను కొనసాగిస్తున్నందున, మరింత ప్రాప్యత, పారదర్శకత మరియు ప్రభావవంతమైన న్యాయ వ్యవస్థకు అవకాశం మరింతగా అందుబాటులోకి వస్తుందని డిజిటల్ న్యాయం యొక్క కొనసాగుతున్న పరిణామం చట్టం మరియు పాలన యొక్క భవిష్యత్తును రూపొందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని అదనపు కలెక్టర్ అన్నారు.ఈ సమావేశానికి హాజరైన జిల్లా అధ్యక్షులు ఇంజమూరి సుధాకర్, కల్లూరి ప్రభాకర్ రావు, తదితరులు వినియోగదారులను ఉద్దేశించి ప్రసంగించారు.ఈ కార్యక్రమంలో డిఎస్ఓ రమేష్, ఎల్డిఎం యాదగిరి, ఫుడ్ ఇన్స్పెక్టర్ ధర్మేంద్ర, డిపిఆర్ఓ రాజేంద్రప్రసాద్, సభ్యులు ఎస్కే జానీ, తదితరులు పాల్గొన్నారు.






# ప్రజా ప్రతినిధులకు ఘన గౌరవ సభ

- **ఎన్నికల విజేతలకు పాయం వెంకటేశ్వర్లు శుభాకాంక్షలు**
- **గ్రామాభివృద్ధికి సమిష్టి బాధ్యతగా చేయాలని ఎమ్మెల్యే పిలుపు**

**మణుగూరు, డిసెంబర్ 24, డీడీ9 వార్త**

స్థానిక మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికల్లో విజయం సాధించిన ప్రజాప్రతినిధుల గౌరవార్థం అభినందన సభ బుధవారం ఘనంగా నిర్వహించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. ఈ సభకు ముఖ్య అతిథిగా హాజరైన పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు నూతనంగా ఎన్నికైన సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులకు అభినందనలు తెలియజేశారు. మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేయాలని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా పాలన సాగించాలని ఆయన సూచించారు. ప్రజల అభిప్రాయమే ప్రజాస్వామ్యానికి పునాది అని ఎమ్మెల్యే అన్నారు. సంక్షేమ కార్యక్రమాలు సక్రమంగా అందేలా ప్రతి ప్రతినిధి చొరవ తీసుకోవాలని కోరారు. గ్రామాల మౌలిక సదుపాయాల మెరుగుదల, సామాజిక న్యాయం, ప్రజల సమస్యల పరిష్కారంలోసమిష్టికృషి అవసరమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యకు లు పిర్నాకి నవీన్,



పట్టణ కాంగ్రెస్ నేతలు, వివిధ సంఘాల ప్రతినిధులు, యువ నాయకులు, మహిళా నేతలు, కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సభ మొత్తం ఉత్సాహభరిత వాతావరణంలో సాగి, ప్రజలు ప్రతినిధుల మధ్య అనుబంధాన్ని మరింత బలపరిచింది.

# రాజేశ్వరరావు పల్లి పాలకమండలిని సన్మానించిన టిఆర్ఎస్ నాయకులు

- ప్రజాసేవకు కట్టుబడి ఉండాలి
- గ్రంథాలయ కమిటీ మాజీ చైర్మన్ గోవింద నాయక్



రాజేశ్వర్రావు పల్లి నూతన సర్పంచి గా ఎన్నికైన గూడూరు ప్రశాంత్, ఉపసర్పంచ్ తవిటి లావణ్య మరియు వార్డు మెంబర్లను గ్రంథాలే కమిటీ మాజీ చైర్మన్ పోరిక గోవింద నాయక్ శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో భారీగా హాజరైన రాజేశ్వరి రావుపల్లి గ్రామస్తులు. ఈ కార్యక్రమంలో గ్రామంలో ఉన్న పలు సమస్యల గురించి అడిగి తెలుసుకున్న గోవింద నాయక్. రాజేశ్వరి పల్లి గ్రామంలో ప్రధాన సమస్యలు అయినటువంటి జిల్లా కేంద్రానికి 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న నర్సాపూర్ గ్రామం నుండి రాజేశ్వరరావు పల్లె రోడ్డు గురించి, భూ సమస్యల గురించి.,అర్హులైనటువంటి ఇంద్రమ్మ ఇళ్ల గురించి, మరియు అర్హులైనటువంటి పెన్షన్ దారుల , పలు సమస్యలను గ్రామస్తులు తెలియజేయడం జరిగింది. అధికార పార్టీ కాంగ్రెస్ అయినప్పటికీ గ్రామానికి వచ్చే నిధులు గ్రామానికి వస్తాయని అన్నారు. గతంలో ఈ గ్రామానికి 90 లక్షల రూపాయల వ్యయంతో రోడ్డుకి అనుమతులు వచ్చాయని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే సంబంధించిన అధికారులకు ఫోన్లో సంప్రదించగా ఆయన స్పందిస్తూ ఇదివరకు వచ్చినటువంటి నిధులు చాలక మధ్యలోనే పనులు నిలిపివేశామని చెప్పగా ఇప్పుడు అదనంగా గ్రామ ప్రజల సౌకర్యార్థం రోడ్డు వెడల్పు కోసం అదనంగా ఎస్టిమేషన్ వేసి నిధుల మంజూరు కొరకు పై అధికారులకు సమాచారం ఇస్తూ నిధుల మంజూరికై ఎదురుచూస్తున్నామని సంబంధిత అధికారి తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా తెలియజేశారు. గోవింద నాయక్ మాట్లాడుతూ నర్సాపూర్ నుండి రాజేశ్వరరావు పల్లి వరకు రోడ్డు సమస్యను తక్షణమే ప్రభుత్వం స్పందించి రాజేశ్వరరావు పల్లె గ్రామ ప్రజల ప్రయాణ సౌకర్యం నిమిత్తం బస్సు సౌకర్యం కూడా కల్పించి వెంటనే రోడ్డు పనులు ప్రారంభించి పూర్తి చేయాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దేవేందర్ రెడ్డి, రాజిరెడ్డి, బాబు చారి, , గట్టయ్య, జవాజి శంకర్, తవిటి శీను, దిలీప్, కుమార్, బాలకృష్ణ, నిమ్మల రవి, సాంబయ్య, రమేష్, రజనీకాంత్ పలువురు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయడం జరిగింది.

# కల్యాణలక్ష్మి , షాది ముభారక్ చెక్కుల పంపిణీ చేసిన సీతక్క

**డీ డీ 9 వార్త, ములుగు బ్యూరో ;**

ఏటూరునాగారం మండల కేంద్రంలోని ఐటిడిఏ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కల్యాణలక్ష్మి, షాది ముభారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమములో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క పాల్గొని ఐటీడీఏ పీఓ చిత్ర మిశ్రా, అదనపు కలెక్టర్ రెవిన్యూ సి హెచ్ మహేందర్ జి లతో కలసి కన్నాయిగూడెం మండల పరిధి లోని 10 మంది, ఏటూరు నాగారం మండల పరిధిలోని 28 మంది లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఏటూరునాగారం మండల కేంద్రంలోని వై జంక్షన్ వద్ద ఉన్న బి ఆర్ ఫంక్షన్ హాల్ లోఏర్పాటు చేసిన క్రిస్మస్ వేడుకల్లో మంత్రి సీతక్క పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొనడం చాలా సంతోషమని క్రిస్టియన్ మతానికి చెందిన వారికి జిల్లా ప్రజలకు క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి, మండల అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



# రాత్రి, పగలు తేడా లేకుండా అధిక లోడుతో...

- అధిక లోడుతో లారీల ద్వారా ఇసుక తోలకలు...
- ప్రభుత్వానికి భారీగా ఆదాయ నష్టం వాటిల్లుతోందని, అధికారుల పర్యవేక్షణ లోపించిందనే విమర్శలు..
- ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ రాత్రి, పగలు తేడా లేకుండా ఇసుక అతిక లోడింగ్ సాగుతోందని ఆరోపిస్తు... ప్రజలు
- ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు..




**పినపాక, డిసెంబర్ 24 (డి డి 9 వార్త)**

మణుగూరు మండలం విజయనగరం సరిహద్దున ఉన్న ర్యాంపు ప్రాంతంలో ఇసుక తరలింపు యథేచ్ఛగా కొనసాగుతున్నట్లు స్థానికుల నుంచి తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి . జెసీబీ, క్రేన్‌ల సహాయంతో అధిక లోడుతో లారీల ద్వారా ఇసుక తోలకలు విచ్చవిడిగా జరుగుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలను బేఖాతరు చేస్తూ రాత్రి, పగలు తేడా లేకుండా ఇసుక అతిక లోడింగ్ సాగుతోందని ఆరోపిస్తున్నారు.

ముఖ్యంగా మెయిన్ రోడ్డు సమీపంలోనే భారీగా లారీలు తిరుగుతూ ఉండటంతో వాహన రాకపోకలు తీవ్రంగా అస్తవ్యస్తంగా మారాయి. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, స్కూల్ వాహనాలు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పీక్ అవర్స్‌లో లారీలు రోడ్డు పక్కనే నిలిపివేయడం వల్ల ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయని, ప్రమాదాల ముప్పు కూడా పెరుగుతోందని వారు ఆరోపిస్తున్నారు.

ఇసుక లోడింగ్ విషయంలో కూడా అనేక అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అనుమతించిన పరిమితికి మించి లారీల్లో ఇసుకను నింపుకొని వెళ్తున్నారని, లోడింగ్ చేసిన తరువాత మరింత పరిమితికి మించి ఇసుకను పోసుకొని, ప్రయాణం కొనసాగిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దీని వల్ల రహదారులు దెబ్బతినడమే కాకుండా వాహనాల నియంత్రణ కోల్పోయే ప్రమాదం ఉందని వారు హెచ్చరిస్తున్నారు.

ఇక, అక్రమ ఇసుక తరలింపుతో ప్రభుత్వానికి భారీగా ఆదాయ నష్టం వాటిల్లుతోందని, అధికారుల పర్యవేక్షణ లోపించిందనే విమర్శలు కూడా వెల్లువెత్తుతున్నాయి. సంబంధిత శాఖ అధికారులు ఈ ప్రాంతంపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీలపై కఠిన చర్యలు తీసుకోవాలని, అధిక లోడింగ్‌ను అడ్డుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. తక్షణమే తనిఖీలు నిర్వహించి అక్రమ ఇసుక తౌలకలను నిలిపివేయాలని, ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. లేదంటే ఆందోళన కార్యక్రమాలకు దిగే అవకాశముందని స్థానికులు హెచ్చరిస్తున్నారు....



# గ్రామపంచాయతీ కార్యాలయంలో క్రిస్మస్ వేడుకలను నిర్వహించిన సర్పంచ్ ఆంగోత్ వినాయక్

**పెద్దపల్లి జిల్లా, డిసెంబర్ 24 (డి డి 9 వార్త):**

పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలంటిటిఎస్ అంతర్గాం గ్రామపంచాయితీ కార్యాలయంలో సర్పంచ్ అంబోతు రవి కుమార్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు.ఈ సందర్భంగా సర్పంచ్ రవి నాయక్ మాట్లాడుతూ కుల, మతాలకతీతంగా మా గ్రామ పంచాయతీలో ప్రతి ఏటా పండుగలునిర్వహించుకోవడం జరుగుతుందని కులమత వివాదా లేకుండా ప్రతి ఒక్కరం కూడా గ్రామంలో కలిసిమెలిసి ఉంటామని, ఉండాలని కోరుకుంటూ ఈ క్రిస్మస్ వేడుకలు నిర్వహించడం జరుగుతుందని సర్పంచ్ ఆంగోత్ రవి నాయక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు వరం,జైకుమార్, దాస్, ప్రసన్నకుమార్, ఇషాక్ , ఎంపీడీఓ తిరుపతి , సూపర్డెంట్ కర్ణాకర్, ఎంపీవో వేణు, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

# ‘మీ డబ్బు – మీ హక్కు’పై జిల్లా స్థాయి అవగాహన సదస్సు

- రూ.46 కోట్ల అన్‌క్లెయిమ్ డిపాజిట్లు తిరిగి పొందాలి : కలెక్టర్
- డిసెంబర్ 31లోపు క్లెయిమ్‌లు పూర్తి చేయాలని ఆదేశాలు

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, డిసెంబర్ 24, డిడి9 వార్త**

జిల్లాలో వివిధ బ్యాంకులు, ఆర్థిక సంస్థల్లో సంవత్సరాలుగా క్లెయిమ్ చేయకుండా మిగిలిపోయిన డిపాజిట్లను తిరిగి పొందేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ‘మీ డబ్బు - మీ హక్కు’ కార్యక్రమాన్ని ప్రజలు పూర్తి స్థాయిలో వినియోగించు కోవాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ పిలుపునిచ్చారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయం సమావేశ మం ది రం లో నిర్వహించిన జిల్లా స్థాయి అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా సుమారు రూ.46 కోట్ల మేర అన్‌క్లెయిమ్ డిపాజిట్లు ఉన్నాయని తెలిపారు.




బ్యాంకుల్లో 10 సంవత్సరాలకు పైగా క్లెయిమ్ చేయని డిపాజిట్లను ఆర్‌బీఐ నిర్వహిస్తున్న ‘ఉద్గమ్’ వెబ్‌సైట్ ద్వారా వివరాలు తెలుసుకుని సులభంగా క్లెయిమ్ చేసుకునే అవకాశం ఉందన్నారు. గ్రామ స్థాయిలో అవగాహన పెంచేందుకు స్వయం సహాయక సంఘాల సభ్యులు ఇంటింటి ప్రచారం చేపట్టాలని అధికారులకు సూచించారు. అలాగే ప్రభుత్వ శాఖల్లో పేరుకుపోయిన అన్‌క్లెయిమ్ డిపాజిట్లను డిసెంబర్ 31లోపు తప్పనిసరిగా క్లియర్ చేయాలని, నిర్లక్ష్యం వహిస్తే షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వివిధ బ్యాంకుల అధికారులు, ప్రభుత్వ శాఖల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యే చోరవ తోనే తాత్కాలిక షెడ్లు చిరు వ్యాపారస్తులు

- **ఎమ్మెల్లే కి కృతజ్ఞతలు తెలిపిన చిరు వ్యాపారస్తులు.**

**డిడి9వార్త / రామగుండం డిసెంబర్ 25:**
గోదావరిఖని చౌరస్తాలోని సింగరేణి కాంప్లెక్స్ ను సింగరేణి యజమాన్యం తొలగించిన సమయంలో కిరాయిదారులకు ఉన్న మేమంతా రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్ ఠాగూర్ ని, ఆర్ జి 1 జిఎం ని కలిసి మా ఉపాధికి ఇబ్బంది కలుగుతుంది అనే అభ్యర్థన మేరకు తాత్కాలికంగా ఎదురుగా ఉన్న సింగరేణి స్థలంలో షెడ్లు వేసుకోవడానికి అనుమతి ఇచ్చారని ఇందుకోసం ఎమ్మెల్యే ఎంతో చొరవ చూపారు అలాగే చౌరస్తాలో మరోవైపు ఉన్న దుకాణాలను సైతం తొలగించి నేపథ్యంలో కూడా వ్యాపారులమైన మా అభ్యర్థన మేరకు మాకు తాత్కాలికంగా షెడ్లు వేసుకోవడానికి ఎమ్మెల్యే చొరవ చూపారు,గోదావరిఖనిలో జరుగుతున్న చాలా రోడ్ల విస్తరణలో అలాగే చాలా చిరు వ్యాపారులకు తాత్కాలికంగా షెడ్లు వేసుకోవడానికి అనుమతి ఇచ్చారు,నూతన షాపుల నిర్మాణం పూర్తి అయిన తర్వాత అందులో అదే గదులను కేటాయిస్తామని ఎమ్మెల్యే హామీ ఇవ్వడం జరిగింది.ఇందుకు ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్ ఠాగూర్ చిరు వ్యాపారస్తుల తరపునుండి కృతజ్ఞతలు తెలుపుతున్నాం.

# ప్రజా సేవలో భాగం ఫౌండేషన్

- **15విలువ చేసే వీధిలైట్ల వితరణ**

**బోనకల్,డిసెంబర్ 23, (డీడీ9 వార్త):**
భాగం సేవా ఫౌండేషన్ నిర్వాహకులు, ఎన్ఆర్ఐ భాగం రాకేష్ తమ సేవా కార్యక్రమాలలో భాగంగా 15 వేల రూపాయల విలువ చేసే వీధిలైట్లను బుధవారం గోవిందాపురం ఏ గ్రామపంచాయతీ సర్పంచ్ ఈశ్రం కరుణ కి వితరణగా అందజేశారు. మరో 10 వేల రూపాయల విలువ చేసే వీధిలైట్లను గ్రామంలోని ఆంజనేయ స్వామి, రామాలయ దేవాలయాలలో అమర్చేందుకు వితరణగా ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామ అభివృద్ధిలో నూతన సర్పంచ్, పాలకవర్గ సభ్యులకు తమ సహకారం ఉంటుందన్నారు. మారుమూల ప్రాంతమైన గోవిందాపురం (ఏ) గ్రామ బాహ్య, అంతర్గత రోడ్ల నిర్మాణానికి కోట్ల రూపాయల నిధులు మంజూరు చేసి అభివృద్ధి దిశగా నడిపించిన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు కృతజ్ఞతలు తెలిపారు. గతంలో బోనకల్, ఆళ్లపాడు పంచాయతీలకు తమ సేవా ఫౌండేషన్ తరపున వీధిలైట్లను వితరణగా ఇచ్చిన సందర్భాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు, గ్రామ పెద్దలు భాగం రాధాకృష్ణ, భాగం రాజేష్, కావూరి వెంకటరావు, భాగం శ్రీనివాసరావు, భాగం పాపారావు, కావూరి జనార్ధన రావు, కావూరి శంకర్రావు,ఇసరం గోపి, సతీష్ పాల్గొన్నారు.



# లద్నాపూర్‌లో జన్మదిన వేడుకలకు హాజరైన జిల్లా యువ నాయకులు గొర్రె నరేష్ యాదవ్...

**మంథని, డిసెంబర్ 23 (డిడి 9 వార్త):**
రామగిరి మండలంలోని లద్నాపూర్ గ్రామానికి చెందిన అద్దూరి సునీత -ప్రవీణ్ కూతుర్లు అద్దూరి శ్రీనిధి, అద్దూరి శ్రీవిద్యల జన్మదిన వేడుకలు ఆదివారం ఆనందోత్సాహాల మధ్య నిర్వహించారు. ఈ వేడుకల్లో జిల్లా యూత్ కాంగ్రెస్ నాయకులు గొర్రె నరేష్‌యాదవ్ పాల్గొని చిన్నారులకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



ఈ కార్యక్రమంలో లద్నాపూర్ ఉపసర్పంచ్ అద్దూరి శ్రీకాంత్, ఐఎన్‌టీవీసీ ocp 2 సెక్రటరీ మనోహర్, సీనియర్ మైనారిటీ నాయకులు ఎండి చాంద్ పాషా, యూత్ నాయకులు మల్లారపు స్వామి, అక్కపాక శ్రీనివాస్, అద్దూరి ప్రవీణ్, అక్కపురం సన్నీ తదితరులు పాల్గొన్నారు.
వేడుకలు స్నేహపూర్వక వాతావరణంలో కేక్ కట్ చేసి, చిన్నారులకు ఆశీస్సులు అందిస్తూ ఘనంగా ముగిశాయి.

# పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

- **మొక్కలు నాటిన సర్పంచ్, ఉపసర్పంచ్, కార్యదర్శి**
- **ఇందిరా డైరీ సభ్యులకు అవగాహన కార్యక్రమం**

**బోనకల్,డిసెంబర్ 24,(డీడీ9 వార్త):**
మండల పరిధిలోని చొప్పకట్లపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయంలో బుధవారం మూడు మొక్కలు నాటారు. ఈ సందర్భంగా సర్పంచ్ కాటేపల్లి అశ్విని, ఉప సర్పంచ్ పల్లా కొండలరావు, కార్యదర్శి శంకర్ లు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత అన్నారు. గ్రామంలో అవకాశం ఉన్న అన్ని



ప్రాంతాల్లో మొక్కలు పెంచడానికి కృషి చేయనున్నట్లు తెలిపారు. శివాలయం వద్ద ఖాళీ స్థలంలో వార్డు సభ్యులు అందరిచేత మొక్కలు నాటించనున్నట్లు తెలిపారు. ఇందిరా డైరీ సభ్యులకు గేదెల పంపిణీపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గేదెల షెడ్ లు నిర్మాణం, గేదెల కొనుగోలు విధానం, సబ్సిడీ వివరాలు, డైరీకి పాలు పోయడం, డైరీ లాభాల్లో సభ్యులకు వాటా లభించే అంశాలపై అవగాహన కల్పించారు.సర్పంచ్ కాటేపల్లి అశ్విని అధ్యక్షతన జరిగిన సభలో ఉపసర్పంచ్ పల్లా కొండల రావు, వార్డు సభ్యులు బోయినపల్లి పున్నయ్య, దారెల్లి రమణమ్మ,డైరీ సి.సి శ్రీలక్ష్మి, ఐ.బి.సి.సి నాగమణి, వి.ఓ.ఎ బోయినపల్లి దివ్య,వి.ఓ అధ్యక్షులు రాణి, ఉషోదయ వి.ఓ అధ్యక్షురాలు రాణి, సంఘాల సభ్యులు పాల్గొన్నారు. మొక్కలు నాటే కార్యక్రమంలో సిపిఎం గ్రామ కమిటీ కార్యదర్శి చలమల అజెయ్ కుమార్, శాఖా కార్యదర్శి బండి శ్రీనివాసరావు, హరికిషన్ రావు, ఉన్నం వెంకటేశ్వర్లు, నల్లమోతు సాయికుమార్, పంచాయతీ సిబ్బంది కొత్తపల్లి రమేష్, దర్శి రాము, షేక్ అస్సాన్ సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

# మానవ సేవే మాధవ సేవ అన్న సూక్తిని నిజం చేస్తున్న భద్రాద్రి పవర్ ప్లాంట్ ఉద్యోగులు..

- **మారుమూల అటవీ ప్రాంతంలో"హెల్పింగ్ హ్యాండ్స్" ఛారిటీ సంస్థ సేవలు..**

**మణుగూరు.డిసెంబర్24 (డి డి 9వార్త)**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మణుగూరు మండలం లోని మారుమూల అటవీ ప్రాంతం అయిన విప్పల గుంపు గిరిజన గ్రామంలో మంగళవారం నాడు గ్రామస్థులకు రగ్గులు, చిన్న పిల్లలకు స్వెట్టర్ లను పంపిణీ చేయడం జరిగింది.తీవ్రమైన చలి, దోమల నుండి చిన్నపిల్లలను,వృద్ధులను రక్షించడానికి వీటిని అందజేసినట్టు వారు తెలిపారు. అలాగే స్థానికంగా ఉన్న అంగన్వాడీ కేంద్రంలో విద్య నభ్యసిస్తున్న సుమారు 50 మంది పిల్లలకు పలకలు,బలపాలు, మరియు అక్షరాలను బోధించుటకు వైట్ బోర్డు ను అందజేశారు. అలాగే అంగన్వాడీ కేంద్రానికి ఒక సీలింగ్ ఫ్యాన్, పిల్లలు కూర్చోవ



డానికి నాణ్యమైన చాపలు,సురక్షిత త్రాగునీరు కొరకు కెంట్ వాటర్ ఫిల్టర్ ను,మధ్యాహ్న భోజనం చేయడానికి ప్లేట్లు,గ్లాసులు, మరియు వంట సామాగ్రి అందించడం జరిగింది. భద్రాద్రి పవర్ ప్లాంట్ ఉద్యోగులు "హెల్పింగ్ హ్యాండ్స్" ఛారిటీ సంస్థ నిర్వహించిన ఈ సేవా కార్యక్రమం లో ముఖ్య అతిథిగా పాల్గొన్న భద్రాద్రి పవర్ ప్లాంట్ చీఫ్ ఇంజనీర్ శ్రీ బిచ్చన్న చేతుల మీదుగా ఈ వస్తువులన్నిటినీ వారికి అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో భద్రాద్రి పవర్ ప్లాంట్ సి ఈ బిచ్చన్న మాట్లాడుతూ.. సమ సమాజ అభివృద్ధిలో భద్రాద్రి పవర్ ప్లాంట్ "హెల్పింగ్ హ్యాండ్స్"టీం సభ్యుల విశేష కృషినీ ఆయన ప్రశంసించారు. విప్పల గుంపు గ్రామాన్ని సందర్శించి ఈ కార్యక్రమంలో పాల్గొనడం తనకెంతో ఆనందంగా ఉందని అన్నారు. బి టి పి ఎస్ ఉద్యోగులు ప్రతి రోజు క్రమశిక్షణతో విధులకు హాజరు అవుతూ, సమయ పాలన పాటిస్తూ విధి నిర్వహణలో ఎంతో బిజీ గా ఉన్నాగాని తోటివారికి సహాయం అందించేందుకు ముందుకు రావడం తనకు గర్వకారణం అని తెలిపారు. ఈరోజు ఇలాంటి గొప్ప కార్యక్రమాన్ని నిర్వహించేందుకు స్ఫూర్తినిచ్చిన సామాజిక కార్యకర్త కర్నె రవి, సామాజిక సేవకులు కర్నె బాబురావు లను ప్రత్యేకంగా అభినందిస్తున్నట్టు సభా ముఖంగా వెల్లడించారు. ఈ కార్యక్రమానికి గత పదిరోజులు గా ముఖ్య భూమికను పోషించిన భద్రాద్రి పవర్ ప్లాంట్ "హెల్పింగ్ హ్యాండ్స్" టీం సభ్యులు,ఉద్యోగులు అయిన మురళీకృష్ణ,మూర్తి,సుగుణాకర్, గ్రౌండ్ లెవెల్ లో సేవలందించిన అరీఫ్ అహ్మద్ (జె ఎ ఓ) గార్ల సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో "హెల్పింగ్ హ్యాండ్స్"టీం సభ్యులు, పవర్ ప్లాంట్ డి ఇ లు, ఎ డి ఇ లు, ఎ ఇ లు, ఓ & ఎమ్ ఉద్యోగులు, ట్రేడ్ యూనియన్ కార్మిక సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా తమ గ్రామానికి విచ్చేసిన భద్రాద్రి పవర్ ప్లాంట్ సి ఈ బిచ్చన్న గారికి, హెల్పింగ్ హ్యాండ్స్ టీం సభ్యులకు ఆదివాసీ ప్రజలు వారి సాంప్రదాయ కొమ్ము, కోలాట నృత్యాలతో వారి కృతజ్ఞతలు తెలియజేశారు.

# ముమ్మాటికి మంత్రి అనుచరులే చెక్‌డ్యాం కూల్చేసిండ్లు...

- **ఎమ్మెల్యే శ్రీధర్ బాబు ప్రెస్‌మీట్‌లో ఒప్పుకున్నట్లుగా అర్థం అవుతోంది...**
- **చెక్‌డ్యాంలు నీళ్ల కోసమే... మాఫియా కోసమో తెలియని దుద్దిళ్ల**
- **నాణ్యత లేదంటూ అధికారులను ప్రభావితం చేస్తున్న ఎమ్మెల్యే**
- **విచారణ లేకుండానే ఎమ్మెల్యే అనుచరులపై కేసులు పెట్టాలే**
- **రెండేళ్లయినా రేవంత్‌రెడ్డి... దుద్దిళ్ల శ్రీధర్‌లు ఏమీ చేయలేదు**
- **మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్**



**మంథని, డిసెంబర్ 24 (డిడి 9 వార్త):**

అడవిసోమన్‌పల్లి మానేరు నిర్మించిన చెక్‌డ్యాంను ముమ్మాటికి మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ బాబు అనుచరులే కూల్చివేశారని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ స్పష్టం చేశారు. బుధవారం మంథని పట్టణంలోని రాజగృహాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముందు నుంచి ఈ ప్రాంతంలో చెక్‌డ్యాంలు నిర్మించడం ఇష్టం లేదని పదేపదే చెప్పిన మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ బాబు అడవిసోమన్‌పల్లి చెక్‌డ్యాంను తన అనుచరులతో కూల్చేపిచ్చినట్లుగా ఆయనే ఒప్పుకున్నట్లుగా ఆయన ఉపన్యాయం వింటే అర్థం అవుతుందన్నారు. చెక్‌డ్యాంను సందర్శించిన ఎమ్మెల్యే శ్రీధర్ మాట్లాడిన తీరు హస్యాస్పదంగా ఉందన్నారు. చెక్‌డ్యాంలు ఇసుక మాఫియా కోసమే నిర్మించారని, ఎవరి లబ్ది కోసమో నిర్మించారని ఆరోపణలు చేసిన మంత్రి తన అవివేకాన్ని చాటుకున్నారని ఎద్దేవా చేశారు. ఎక్కడైనా చెక్‌డ్యాంలు ఇసుక కోసం కడుతారా లేక నీళ్లను నిల్వ చేసుకోడానికి కడుతారా అని ఆయన ప్రశ్నించారు. చెక్‌డ్యాంలు కడితే నీళ్లు నిలుస్తాయని, ఆ నీళ్లను మాఫియా ఎత్తుకుపోతుందా అని ప్రశ్నించారు, అదే చెక్‌డ్యాంలు లేకపోతనే ఇసుక దోపిడి చేయవచ్చని, మాఫియాను నడిపించవచ్చనే విషయం తెలియకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గొప్పగా ఆలోచన చేసి భూగర్భజలాల పెంపుతో పాటు పశువులు, పక్షులు ఇతర జలచరాల కోసం చెక్‌డ్యాంల నిర్మాణం చేశామని, మంథని బొక్కలవాగుపై కూడా చెక్‌డ్యాం అవసరం లేదని మాట్లాడాడని ఆయన గుర్తు చేశారు. రెండు రోజుల క్రితమే వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియా రాజేంద్రసింగ్ వచ్చి పరిశీలించి ఇది ఖచ్చితంగా పేల్చివేతనేనని స్పష్టం చేశారని అన్నారు. అవగాహనలేమితోమాట్లాడుతున్న మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ బాబు రంగు, కులం చూసి ఓట్లు వేస్తున్నారని ఆయన దుయ్యబట్టారు. ఎమ్మెల్యే శ్రీధరే తెలివితక్కువ దద్దమ్మల్లా మాట్లాడుతున్నాడంటే ఆయన పక్కనున్న వాళ్లు సైతం అదే దోరణితోమాట్లాడుతున్నారని అన్నారు. చెక్‌డ్యాం నాణ్యతతో నిర్మించలేదని మంథని ఎమ్మెల్యే దృవీకరిస్తూ విచారణకు ఆదేశించామని అంటున్నారని, మంత్రి స్థాయిలో నాణ్యత లేదని చెప్తుంటే అధికారులు మరో తీరు నివేదిక ఇస్తారా అని ఆయన ప్రశ్నించారు. పరోక్షంగా అధికారులను భయపెడుతూ తమకు అనుకూలంగా రిపోర్ట్ వచ్చేలా మట్టాడుతున్నారని ఆయన అన్నారు. రెండేళ్లుగా విచారణలంటూ రేవంత్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌లు ఏమీ చేయలేదని, కాలయాపన తప్ప పైసా పని చేయడం లేదని విమర్శించారు. ప్రభుత్వానికి, మంథని ఎమ్మెల్యేకు చిత్తశుద్ధి ఉంటే మీ తమ్ముడు మెడికల్ కాలేజీ ఉద్యోగాలకు ఐదు, పది లక్షలకు అమ్ముకుంటున్నాడో దానిపై విచారణ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కేవలం ఆరోపణలు చేయడం, విచారణకు ఆదేశించామని చెప్పడం తప్ప ఏదైనా పూర్తి చేశారా అని ఆయన ప్రశ్నించారు. ఆనాడు తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఇసుక బంద్ చేయిస్తామని చెప్పి రెండేళ్లు అయినా ఎందుకు బంద్ చేయించలేదని ప్రశ్నించారు. ఎవరైనా ప్రశ్నిస్తే కేసులు పెట్టించడం, ఇండ్లు కూలగొట్టించడం తప్ప ఓ ఇద్దరికి ఇండ్లు కట్టించారా అని ప్రశ్నించారు. మంథనిలో మాజీ వార్డు కౌన్సిలర్ ఇళ్లను అన్యాయంగా కూలగొట్టారని, ముందుగా అనుమతి ఇచ్చి ఆ తర్వాత కూల్చివేశారని ఆయన తెలిపారు. దేశంలోనే చెక్‌డ్యాం వద్దనేటోళ్లను చూడలేదని, కానీ మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్ ఒక్కడేనని ఆయన అన్నారు. సమాజం మేల్కొనే వరకు చైతన్యవంతం అయ్యే వరకు పుట్ట మధు విస్మరించడని, మీపై రౌడీ షీట్ ఓపెన్ చేయిస్తానని ఆయన స్పష్టం చేశారు. చెక్‌డ్యాం కూల్చివేతపై విచారణ చేయకుండానే దుద్దిళ్ల శ్రీధర్‌తో పాటు ఆయన అనుచరులపై కేసులు నమోదు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.


# అట్రాసిటీ కేసులకు వేగవంతమైన పరిష్కరించాలి

- **బాధితులకు తక్షణ న్యాయం లక్ష్యం : జితేష్ వి. పాటిల్**
- **ఎస్సీ, ఎస్టీ యువతకు ఉపాధి శిక్షణపై ప్రత్యేక దృష్టి**

**భద్రాద్రి కొత్తగూడెం బ్యూరో, డిసెంబర్ 24, డిడి9 వార్త**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వ్యాప్తంగా నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు త్వరితగతిన న్యాయం అందించడం ప్రభుత్వ ప్రాధాన్యతగా అమలవుతుందని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ స్పష్టం చేశారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా ఎస్పీ రోహిత్ రాజుతో కలిసి జిల్లా స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు.

ఈ సందర్భంగా పోలీస్ శాఖలో పెండింగ్‌లో ఉన్న 34 అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులను వేగంగా పూర్తిచేసి బాధితులకు న్యాయం అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రతి కేసు పారదర్శకంగా విచారణ జరిపి నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టాలని సూచించారు. అత్యాచార బాధిత మహిళలకు భరోసా కేంద్రం



ద్వారా అవసరమైన సహాయం అందించాలని, అలాగే పాఠశాల స్థాయిలోనే ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు కుల ధ్రువీకరణ పత్రాలు అందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. యువత ఉపాధి అవకాశాల కోసం నైపుణ్యాభివృద్ధి శిక్షణ కార్యక్రమాలను విస్తరించనున్నట్లు తెలిపారు.

అనంతరం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ బాధితుల భద్రతకు పూర్తి ప్రాధాన్యత ఇస్తూ అన్ని అట్రాసిటీ కేసుల దర్యాప్తు వేగంగా పూర్తి చేస్తామని భరోసా ఇచ్చారు.

# కరెంట్ షాక్ తో పాడి గేదె మృతి

**మంథని డిసెంబర్ 24 (డిడి 9 వార్త);**

మంథని పట్టణం లో పాడి గేదె మృతి చెందిన బుధవారం సంఘటన చోటు చేసుకుంది. మంథని పట్టణానికి చెందిన రైతు

మూలపురుషోత్తం రెడ్డి పాడి గేదె మేత మెస్తూ ఉండగా మంథని గోదావరి వద్ద విద్యుత్ షాక్ గురై అక్కడిక్కడే మృతి చెందింది. గేదె విలువ 70 వేల వరకు ఉంటుందని ప్రభుత్వం నుండి నష్ట పరిహారం ఇప్పించాలని విద్యుత్ అధికారులను బాధితుడు కోరారు.



## జిల్లా ప్యానెల్ కౌన్సిల్ గా కన్నోజు సునీల్ కుమార్

**డీ డీ 9 వార్త, ములుగు బ్యూరో :**



ములుగు జిల్లా కోర్టు లో కేంద్ర ప్రభుత్వం తరపున కేసులను వాదించేందుకు జిల్లా ప్యానెల్ కౌన్సెల్ గా ములుగు జిల్లా కి చెందిన కన్నోజు సునీల్ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వం ముగ్గురు న్యాయవాదులను జిల్లా ప్యానెల్ కౌన్సిల్ గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కన్నోజు సునీల్ కుమార్ మూడేళ్లు ఈ పదవిలో కొనసాగను న్నారు. 2009 నుండి న్యాయవాదిగా పేరు నమోదు చేసుకొని ఇక్కడ న్యాయవాదిగా పని చేస్తున్నారు. ఆయన నియామకం పట్ల పలువురు న్యాయవాదులు హర్షం వెలిబుచ్చారు.

ఈ నియామకానికి సహకరించిన కేంద్ర ప్రభుత్వనికి సునీల్ కుమార్ గారు ధన్యవాదములు తెలియజేయడం జరిగింది.




## సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (SCCWUIFTU) ఆధ్వర్యంలో కోల్ ఇండియా డైరెక్టర్ I/R P.M కి మెమోరండం

**మంథని డిసెంబర్ 24 (డిడి 9 వార్త);**

కలకత్తాలోని కోల్ భవన్ లో సింగరేణి లో పనిచేసే అన్ని డిపార్ట్మెంట్ కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచాలని, HPC వేతనాలు అమలు చేయించాలని. ఈరోజు సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (SCCWU IFTU) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో వినయ్ రంజన్ డైరెక్టర్ I/R. PM కోల్ ఇండియా కలకత్తా గారికి. మెమోరండం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ( SCCWUIFTU) రాష్ట్ర నాయకత్వం మాట్లాడుతూ. 2013 జనవరి నెలలో కోల్ ఇండియా యాజమాన్యం కాంట్రాక్టు కార్మికులకు హైపర్ కమిటీ వేతనాలు చెల్లించాలనీ సర్క్యులర్ విడుదల చేయడం జరిగింది. కానీ నేటికీ సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ( SCCL) కాంట్రాక్ట్ కార్మికులకు నేటికీ అమలుకు అవడం లేదు.కోల్ ఇండియా లో పర్మినెంట్ కార్మికులకు చేసిన ఒప్పందాలు యధావిధిగా అమలైనప్పు డు హై పవర్ కమిటీ( HPC)వేతనాలు ఎందుకు అమలు కావడం లేదో చెప్పాలని నిలదీయడం జరిగింది. కాంట్రాక్ట్ కార్మికుల వేతనాల పైన సింగరేణిలో జాతీయ కార్మిక సంఘాలు, జే.బీ.సీ.సీ.ఐ సంఘాలు. కాంట్రాక్ట్ కార్మికుల వద్ద మీటింగ్ లు పెట్టి మీ వేతనాలు పెంచుతాము. హామీలు, ఇవ్వడం, గొప్పలు చెప్పుకోవడం తప్ప, సింగరేణి యాజమాన్యం పైన, కోల్ ఇండియా యాజమాన్యం పైన ఒత్తిడి తీసుకురావడం లేదు. కాంట్రాక్ట్ కార్మికుల వేతనాల గురించి హక్కులు, సౌకర్యాల గురించి ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా కోల్ ఇండియా యాజమాన్యం చొరవ తీసుకొని సింగరేణిలో పనిచేసే కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు పెంచాలని, HPC వేతనాలు చెల్లించాలని, డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఈ నరేష్ ( IFTU) రాష్ట్ర నాయకులు ( SCCWU IFTU) డి బ్రహ్మానందం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ , ఏ వెంకన్న. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జే సీతారామయ్య, గౌని నగేష్, రాష్ట్ర సహాయ కార్యదర్శి, ఎన్. సంజీవ్, మోతుకూరి మల్లికార్జున్ రాష్ట్ర నాయకులు.

**విప్లవ అభివందనలతో**

డి బ్రహ్మానందం ( SCCWU IFTU)

సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్



## ముత్తారం మండల బీఆర్ఎస్ నూతన సర్పంచులకు ఘన సన్మానం

**మంథని డిసెంబర్ 24 (డిడి 9 వార్త);**

ముత్తారం మండలంలో బీఆర్ఎస్ పార్టీ నూతనంగా ఎన్నికైన సర్పంచులను ముత్తారం మండల బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు ఘనంగా సన్మానించారు. ఓడేడు గ్రామ బీఆర్ఎస్ పార్టీ నూతన సర్పంచి పోతిపెద్ది కవిత - కిషన్ రెడ్డి, ముత్తారం హెడ్ క్వార్టర్ బీఆర్ఎస్ పార్టీ నూతన సర్పంచి సూదాటి రవీందర్ రావు, లక్కారం గ్రామ బీఆర్ఎస్ పార్టీ నూతన సర్పంచి అత్తే చంద్రమౌళి ఖమ్మంపల్లి గ్రామ బీఆర్ఎస్ పార్టీ నూతన సర్పంచి నక్క రాజేశ్వరి -రాజయ్యను శాలువలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు అలువోజు రవీందర్, నిమ్మతి రమేష్, అడ్డూరి భాస్కర్, నరెడ్ల రమేష్, జంగ వెంకటరెడ్డి, నీరటి రవి, ఊట్ల శ్రీను, లక్కారం రమేష్తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

ఈ సందర్భంగా నూతన సర్పంచులు మాట్లాడుతూ గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.



## అయ్యప్ప ఇరుముడి పూజ కార్యక్రమంలో పాల్గొన్న పన్నూర్ గ్రామ సర్పంచ్ చిందం మహేష్

**మంథని, డిసెంబర్ 24 (డిడి 9 వార్త);**

రామగిరి మండలం పన్నూర్ పంచాయితీ శ్రీ ఆంజనేయ స్వామి టెంపుల్ దేవాలయంలో, స్వాములు 41 రోజుల కఠోర దీక్షను నియమ నిష్ఠలతో పూర్తి చేసి శబరిమల యాత్రకు వెళ్తున్న సందర్భంగా నిర్వహించిన అయ్యప్ప ఇరుముడి పూజా కార్యక్రమంలో పన్నూర్ గ్రామ సర్పంచ్ చిందం మహేష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రామగిరి మండలం కాంగ్రెస్ పార్టీ ప్రచార కమిటీ చైర్మన్ ముస్త్యాల శ్రీనివాస్, సెంటినరి కాలనీ టౌన్ అధ్యక్షులు కాటం సత్యం, పన్నూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు ఏరావేనా అజయ్, సిద్ధం బన్నీ, సదన్, శ్రీధర్ వీణ తదితరులు పాల్గొన్నారు* ఈ సందర్భంగా స్వాములను హృదయపూర్వకంగా అభినందించిన సర్పంచ్ చిందం మహేష్, అయ్యప్ప స్వామి ఆశీస్సులతో వారి శబరిమల యాత్ర సాఫీగా, నిర్విఘ్నంగా, సుభిక్షంగా సాగాలని ఆకాంక్షించారు. అనంతరం యాత్రకు బయలుదేరుతున్న స్వాములను కలిసి ఆశీర్వాదాలు తీసుకొని, అయ్యప్ప స్వామి కృపతో అందరికీ ఆరోగ్యం, శాంతి, శుభఫలితాలు కలగాలని ప్రార్థించారు. భక్తి, నమ్మకం, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే అయ్యప్ప స్వామి పూజా కార్యక్రమాల్లో పాల్గొనడం తనకు ఎంతో ఆధ్యాత్మిక ఆనందాన్ని కలిగిస్తుందని ఆయన తెలిపారు.

## వీకెండ్ డెస్టినేషన్ ఉమ్మడి వరంగల్,పర్యాటక బ్రోచర్ ఆవిష్కరించిన - జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్

**డిడి 9 వార్త మహబూబాబాద్ జిల్లా బ్యూరో డిసెంబర్ 24:**

రాజధాని హైదరాబాద్ నుంచి రెండు, మూడు గంటల ప్రయాణంలోనే చారిత్రక కట్టడాలు, సాంస్కృతిక వైభవం, అభయారణ్యాలను ఆస్వాదించాలంటే ఉమ్మడి వరంగల్, మహబూబాబాద్ ను సందర్శించాల్సిందే. కాకతీయుల చరిత్రకు సజీవ సాక్ష్యాలుగా నిలిచిన, యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప, వేయి స్తంభాల ఆలయం, ఖిలా వరంగల్, భద్రకాళి ఆలయం, ఘనపురం కోటగుళ్లు, లక్నవరం సరస్సు , పాకాల సరస్సు,భోగత జలపాతం, మేడారం జాతర, ఏటూరునాగరం, తాడ్వాయి అభయారణ్యాలు, మహబూబాబాద్ జిల్లా పరిధి లోని బయ్యారం పెద్ద చెరువు, భీముని పాదం, కురవి, తలపూసపల్లి శ్రీ వెంకటేశ్వర స్వామి, ఇనుగుర్తి, దేవాలయం, ఏడు బావులు, అద్భుతమైన చెరువులు, అడ్వెంచర్ ,స్పిరిచువల్, పురాతనమైన దేవాలయాలు, హెరిటేజ్ వాటర్ బాడీస్, తదితర పర్యటక ప్రదేశాలు గుహలు దేశ, విదేశీ పర్యాటకులు ఇష్టపడే ప్రాంతాలు చాలా ఉన్నాయి. సాహస క్రీడల ప్రాంతాలు, చరిత్రక లోకల్ ఫుడ్ వరంగల్ కు ప్రత్యేకంగా గుర్తింపు ఉంది.

ఈ నేపథ్యంలో రాష్ట్రంలో వివిధ జిల్లాల్లోని పర్యాటక ప్రాంతాల పరిచయంలో భాగంగా 100 ప్రదేశాలను 'వీకెండ్ డెస్టినేషన్లు'గా మార్చేందుకు పర్యాటక అభివృద్ధి సంస్థ సరికొత్త ప్రయత్నాన్ని ప్రారంభించింది. ఇప్పటికి అంతగా వెలుగులోకి రానివి ఈ జాబితాలో చేరుస్తోంది. ఆయా ప్రాంతాలకు హైదరాబాద్ తో పాటు జిల్లాల నుం పర్యాటకుల్ని పెంచాలన్నది ప్రధాన లక్ష్యం అని కలెక్టర్ అన్నారు.వీకెండ్ ట్రిప్ ప్లాన్స్.... వీకెండ్ ట్రిప్ లపై ఆసక్తి ఉన్నవారు హైదరాబాద్లోనే సుమారు 10 లక్షల మంది ఉంటారని పర్యాటక సంస్థ అంచనా వేసింది. ప్రధానంగా ఐటీ ఉద్యోగులతోపాటు వర్సిటీల్లో విద్యార్థులు, పరిశ్రమల్లో పనిచేస్తున్న వారు తమ స్నేహితులు, కుటుంబాలతో ప్రయాణాలకు ఆసక్తి చూపిస్తున్నారని గుర్తించింది. ఈ 'హైపర్ లోకల్ టూరిస్టు'లను దృష్టిలో పెట్టుకుని హైదరాబాద్ నుంచి 50200 కి.మీ. దూరంలో 100 వారాంతపు పర్యాటక ప్రదేశాల సమాచారాన్ని క్రౌడ్ సోర్సింగ్ ద్వారా సేకరిస్తోంది. ప్రధానంగా శని, ఆదివారాలు.. లేదా ఇతర సెలవు రోజుల్లో ఒకట్రెండు రోజులు సరదాగా వెళ్లివచ్చే ప్రదేశాలను ఈ జాబితాలో చేరుస్తోంది. ఆయా ప్రాంతాలకు రోడ్డు కనెక్టివిటీ, సమీపంలోని వసతి సదుపాయాలు.. అడ్వెంచర్, వాటర్ స్పోర్ట్స్, స్థానిక వంటకాలు వంటి పూర్తి సమాచారాన్ని పర్యాటక సంస్థ అధికారులు సేకరిస్తున్నారు.




**100 వీకెండ్ వండర్స్ ఆఫ్ తెలంగాణ' పోటీలకు ఆహ్వానం**


రాష్ట్రంలోని అద్భుతమైన పర్యాటక ప్రాంతాలకు ప్రాచుర్యం కల్పించే విధంగా '100 వీకెండ్ వండర్స్ ఆఫ్ తెలంగాణ' పేరుతో పోటీలను నిర్వహిస్తున్నట్లు టూరిజం డెవల ప్మెంట్ కార్పొరేషన్ ఎండీ వల్లూరు క్రాంతి వెల్లడించారు. తెలంగాణలోని పర్యాటక ప్రదేశం స్పష్టంగా కనిపించేలా 3 ఫొటోలు, 60 సెకెన్ల వీడియో, వంద పదాల్లో ప్రత్యేకతను వివరిస్తూ జన వరి 5లోగా ఎంట్రీలను పంపాలని సూచించారు. అందులో హైదరాబాద్ నుంచి కనెక్టివిటీ, వసతి తది తర వివరాలను తెలియజేయాలని సూచించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు వరుసగా రూ.50 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు ఇస్తామన్నారు. పది మందికి కన్సొలేషన్ బహుమతులు అంద జేస్తామన్నారు. సంక్రాంతి రోజున కైట్ ఫెస్టివల్లో బహుమతులను ప్రదానం చేస్తారు.ఈ పోస్టర్ ఆవిష్కరణ జిల్లా కలెక్టర్ అండ్ మెజిస్ట్రేట్ అద్వైత్ కుమార్ సింగ్, ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యటకశాఖ అధికారి ఎం.శివాజీ, జిల్లా పౌర సంబంధాల అధికారి పి.రాజేంద్ర ప్రసాద్, టూరిజం ఇన్ఫర్మేషన్ అసిస్టెంట్ కే లోకేశ్వర్, లతో కలిసి పోస్టర్ ఆవిష్కరించారు.

## కన్నుల పండుగలా జరిగిన నూతన సర్పంచుల అభినందన సభ

- **నూతనంగా ఎన్నికైన ప్రజా ప్రతినిధులను ఘనంగా సన్మానించిన ఎమ్మెల్యే పాయం..**

**మణుగూరు.డిసెంబర్24 (డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మణుగూరు మండలం లోని గ్రామపంచాయతీ లకు జరిగిన స్థానిక సంస్థల ఎన్నికలలో విజయం సాధించిన సర్పంచ్, ఉప సర్పంచ్ మరియు వార్డు సభ్యుల "అభినందన సభ" బుధవారం నాడు అంగరంగవైభవంగా జరిగింది. పట్టణం లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం(ప్రజా భవన్) ఎదురుగా గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో కన్నుల పండుగలా జరిగింది. అందులో భాగంగా మణుగూరు మండలం కూనవరం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ గా పదవీ బాధ్యతలు చేపట్టిన శ్రీమతి ఏనిక శ్వేత ను శాలువా తో ఘనంగా సన్మానించడం జరిగింది.అనంతరం ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ..పంచాయతీ అభివృద్ధి కోసం అంకిత భావంతో పనిచేసి ప్రజల ఆదరాభిమానాలు చూరగొనాలని అన్నారు. ఈ అభినందన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పీరినాకి నవీన్, మండల నాయకులు దొబ్బల వెంకటప్పయ్య,శివాలయం చైర్మన్ కూచిపూడి. బాబు, ఐ ఎన్ టి యు సి నాయకులు సామా. శ్రీనివాస్ రెడ్డి, బ్రాంచి కార్యదర్శి కృష్ణంరాజు. అలాగే కూనవరం గ్రామ పంచాయతీ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎనిక బాలకృష్ణ, ముసలి. శ్రీనివాస్,వల్లభనేని. ఉపేందర్, గొర్రె. ప్రశాంత్, ఎనిక. మంగతాయారు, ఎమ్ డి. జహ బేగం, ఎమ్ డి. గౌస్ పాషా తదితరులు పాల్గొన్నారు.



## ఎమ్మెల్యే మక్కన్ సింగ్ రాజ్ ఠాగూర్ ఆదేశాల మేరకు అభివృద్ధి పనులు

- **ప్రమాణ స్వీకారం మొదటి రోజే పనులు ప్రారంభించిన ఆకెనపల్లి సర్పంచ్ గాదె స్రవంతి–సుధాకర్**
- **ఇందిరమ్మ ఇళ్ల స్లాబ్ నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టి పనుల ప్రారంభం**

**పెద్దపల్లి బ్యూరో, డిసెంబర్ 24 (డిడి9 వార్త):**

రామగుండం శాసనసభ్యులు మక్కన్ సింగ్ రాజ్ ఠాగూర్ ఆదేశాల మేరకు ఆకెనపల్లి గ్రామ సర్పంచ్ గాదె స్రవంతి-సుధాకర్ ప్రమాణ స్వీకారం చేసిన మొదటి రోజే గ్రామ అభివృద్ధి దిశగా కీలక అడుగు వేశారు.

కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ ప్రజా పాలనలో భాగంగా, ఆకెనపల్లి గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబమైన పిలకాని భాగ్య-స్వామి ఇందిరమ్మ ఇంటి స్లాబ్ నిర్మాణ పనులకు సర్పంచ్ గాదె స్రవంతి-సుధాకర్ కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... తనపై నమ్మకంతో 182 ఓట్ల భారీ మెజారిటీతో గెలిపించిన ఆకెనపల్లి గ్రామ ప్రజలందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ అభివృద్ధే లక్ష్యంగా నిరంతరం పనిచేస్తానని, ఎమ్మెల్యే రాజ్ ఠాగూర్ సహకారంతో ఆకెనపల్లి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తానని తెలిపారు. ఈ అవకాశం కల్పించిన



గ్రామ ప్రజానీకానికి ఎప్పటికీ రుణపడి ఉంటానని ఆమె పేర్కొన్నారు.





# బస్టాండ్ అడ్డాగా బరితెగింపు

- **కూత వేటు దూరంలోనే పోలీస్ స్టేషన్**
- **అయినా రెచ్చిపోతున్న ఆకతాయిలు**
- **గంజాయి మద్యం మత్తులో పెట్రేగుతున్న పోకిరిలు**
- **పోకిరాల వికృత చేష్టలు**
- **వేధింపులకు గురవుతున్న మహిళలు**
- **ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు**

**వైరా క్రైమ్, డిసెంబర్ 24, డిడి9 వార్త :**

వైరా పట్టణంలోని బస్టాండ్ రోజురోజుకీ ఆకతాయిల అడ్డాగా మారుతోందనే ఆరోపణలు గట్టిగా వినిపిస్తున్నాయి. ఖమ్మం, హైదరాబాద్, భద్రాచలం, కొత్తగూడెం, మధిర వంటి కీలక పట్టణాలకు రాకపోకలు సాగించే ప్రధాన కేంద్రంగా ఉన్న ఈ బస్టాండ్‌లో ప్రతిరోజూ వందల సంఖ్యలో బస్సులు రాకపోకలు కొనసాగిస్తుండగా, వేలాది మంది ప్రయాణికులు ఈ మార్గం ద్వారా తమ గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు ప్రయాణికుల తాకిడి అధికంగా ఉండే ఈ ప్రాంతం భద్రతా పరంగా మాత్రం ప్రశ్నార్థకంగా మారింది. గత కొన్ని నెలలుగా బస్టాండ్‌లో ఆకతాయిల ఆగడాలు హద్దులు దాటుతున్నాయని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా సాయంత్రం వేళల నుంచి రాత్రి వరకు కొందరు యువకులు బస్టాండ్‌కు చేరుకొని పోకిరితనంతో ప్రవర్తిస్తూ మహిళలు, విద్యార్థినులను వేధిస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలేజీలు, పాఠశాలల నుంచి తిరిగివచ్చే ఆడపిల్లలతో అసభ్యంగా మాట్లాడటం, బస్సు ఎక్కే సమయంలో రద్దీని ఆసరాగా చేసుకొని తాకడం, వెకిలి చేష్టలతో ఇబ్బంది పెట్టడం వంటి ఘటనలు నిత్యకృత్యంగా మారినట్లు చెబుతున్నారు.

**మహిళలకు తప్పని వేధింపులు**

చుట్టుపక్కల గ్రామాల నుంచి విద్యాభ్యాసం కోసం ప్రతిరోజూ అనేక మంది విద్యార్థులు వైరా బస్టాండ్‌కు వస్తుంటారు. ఆ సమయంలో కొందరు ఆకతాయిలు మహిళల పక్కన కూర్చొని అనవసరంగా మాటలు వేయడం, చూపులతో వేధించడం, అవకాశం దొరికితే తాకడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపణలు ఉన్నాయి. ఈ ఘటనలపై పోలీసులకు ఫిర్యాదు చేస్తే లేనిపోని సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్న భయంతో చాలామంది మహిళలు మౌనంగా ఉండిపోతున్నారని తెలుస్తోంది. దీంతో ఆకతాయిలకు మరింత ధైర్యం పెరుగుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

**అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా**

రాత్రి వేళల్లో బస్టాండ్ వెనుకభాగం పూర్తిగా అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రంగా మారుతోందన్న ఆరోపణలు ఉన్నాయి. కొందరు యువకులు అక్కడ మద్యం సేవించడం, గంజాయి తాగడం వంటి పనులకు పాల్పడుతూ మత్తులో ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారని ప్రయాణికులు వాపోతున్నారు. ఈ మత్తు ప్రవర్తనే మహిళలపై వేధింపులకు, గొడవలకు కారణమవుతోందని స్థానికులు చెబుతున్నారు.

**పోలీస్ స్టేషన్ సమీపంలోనే పరిస్థితి ఇదేనా?**

ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే, బస్టాండ్‌కు అతి సమీపంలోనే పోలీస్ స్టేషన్ ఉన్నప్పటికీ ఇలాంటి ఘటనలు జరుగుతుండటంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బస్టాండ్‌లో జరుగుతున్న ఆకతాయిల ఆగడాలపై ఆర్టీసీ అధికారులు గానీ, పోలీసులు గానీ తగిన చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో ఇది అధికార యంత్రాంగ వైఫల్యానికి నిదర్శనమని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

**ప్రయాణికుల్లో భయం**

రాత్రి సమయంలో బస్టాండ్‌కు వెళ్లాలంటేనే భయం వేస్తోందని మహిళలు, వృద్ధులు, సాధారణ ప్రయాణికులు వాపోతున్నారు. కుటుంబ సభ్యులను పంపించాలన్నా, స్వయంగా ప్రయాణించాలన్నా భద్రత లేదన్న భావన పెరిగిపోతోంది. ఇదే పరిస్థితి కొనసాగితే బస్టాండ్ వినియోగంపై కూడా ప్రజలు వెనకడుగు వేసే ప్రమాదం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

**చర్యలు ఎప్పుడెప్పుడు?**

ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి బస్టాండ్‌లో నిరంతర పోలీస్ గస్తీ ఏర్పాటు చేయాలని, సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని, ఆకతాయిలపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. మహిళలకు భద్రత కల్పించి, ప్రయాణికులు ఎలాంటి భయాందోళన లేకుండా రాకపోకలు సాగించేలా చూడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని ప్రజలు స్పష్టం చేస్తున్నారు.

# ఆడబిడ్డ గోసపడితే ఉసురు తాకక మానదు

- **సిరిశెట్టి మల్లేష్ కుటుంబానికి న్యాయం జరిగేంతవరకు అండగా ఉంటాం**
- **బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వ్యాల్ల హరీష్ రెడ్డి**



**పెద్దపల్లి బ్యూరో, డిసెంబర్ 24 (డిడి9 వార్త):**

గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో అక్రమంగా కూల్చివేతకు గురైన సిరిశెట్టి జయసుధ-మల్లేష్ కుటుంబాన్ని బుధవారం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, వీహెచ్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు వ్యాల్ల హరీష్ రెడ్డి పరామర్శించారు. బాధిత కుటుంబం చేపట్టిన శాంతియుత నిరసన దీక్షకు సంఘీభావం ప్రకటిస్తూ, న్యాయం జరిగేంతవరకు అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా హరీష్ రెడ్డి మాట్లాడుతూ... పేదవారి ఇళ్లను కూల్చడమే అభివృద్ధి అనుకుంటే అది భ్రమేనని అన్నారు. రామగుండంలో జరుగుతున్న అక్రమ కూల్చివేతలు ప్రజాపాలనకు మచ్చగా మారాయని విమర్శించారు. మున్సిపల్ అనుమతులతో నిర్మించిన ఇంటిని కొందరు ప్రజా కంటక నాయకుల కుట్రతో అక్రమంగా కూల్చివేశారని ఆరోపిస్తూ, దీనికి బాధ్యులైన నాయకులు, అధికారులపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బాధిత కుటుంబానికి మూడు రోజులు గడిచినా న్యాయం చేయకపోవడం వెనుక ఎమ్మెల్యే హస్తం ఉందని ఆరోపించిన హరీష్ రెడ్డి, పూర్తి బాధ్యత ఎమ్మెల్యేదేనని పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ అండగా ఉంటుందని స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు రత్నాకర్, బొబ్బిలి సతీష్, బక్కీ కిషన్, రమణ రెడ్డి, మాజీ కౌన్సిలర్ కృష్ణస్వామి, బీఆర్ఎస్ అధికార ప్రతినిధి జహీద్ పాషా, మహిళా ఉద్యమకారిణి పరుశ స్వాతి, యువజన నేతలు, పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌సీ కాలనీలో సెంట్రల్ టవర్, సాయిశ్వర్ కిరణం టవర్‌కు లైట్ల ఏర్పాటు

**మంథని, డిసెంబర్ 24 (డిడి 9 వార్త);**



రామగిరి మండలంలోని లద్నాపూర్ గ్రామంలోని ఎస్‌సీ కాలనీలో ఉన్న సెంట్రల్ టవర్‌కు అలాగే సాయిశ్వర్ కిరణం వద్ద ఉన్న టవర్‌కు గ్రామ సర్పంచ్ వనం రాంచందర్ రావ్ లైట్లు ఏర్పాటు చేయించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అడ్డూరి శ్రీకాంత్, వార్డ్ సభ్యులు మల్లారపు స్వామి పాల్గొని గ్రామ అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను అభినందించారు. గ్రామ ప్రజల భద్రత, సౌకర్యాల కోసం ఇలాంటి పనులు కొనసాగుతాయని సర్పంచ్ తెలిపారు. గ్రామస్థులు సర్పంచ్‌తో పాటు ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలియజేశారు.



## పీఏసీఎస్ పాలకవర్గ సభ్యులకు సన్మానం

**మంథని డిసెంబర్ 24 (డిడి 9 వార్త);**

పీఏసీఎస్ పాలకవర్గాన్ని ప్రభుత్వం రద్దు చేసిన క్రమంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన సింగిల్ విండో వైస్ చైర్మన్, డైరెక్టర్‌లను మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ సన్మానించారు. బుధవారం మంథనిలోని రాజగృహాలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులను ఆయన అభినిందించి శాలువాతో సత్కరించారు. రైతులకు మేలు చేసే కార్యక్రమాల్లో బాగస్వాములుగా విజయవంతం చేసినందుకు వారిని ఆయన అభినందించారు.



## ఆస్పత్రిలో అనారోగ్యతో బాధపడుతున్న మహిళకు పరామర్శ

- **జూపెడ సర్పంచ్ వనవాసం నరేందర్ రెడ్డి**

**తిరుమలయపాలెం, డిసెంబర్ 24, డి డి 9 వార్త**

మండల పరిధిలోని జూపేడ గ్రామంనికి చెందిన లంజపల్లి ఆదెమ్మ,భర్త నాగయ్య,అనే మహిళా కొద్ది రోజుల నుండి ఖమ్మం ప్రైవేట్ ఆస్పత్రిలో అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్నది. విషయం తెలుసుకున్న ఆ గ్రామ సర్పంచ్ వనవాసం నరేందర్ రెడ్డి, బుధవారం ఆస్పత్రిలో ఆమెని కలిసి పరామర్శించారు. సందర్భంగా కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ఇచ్చారు, ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం కొంత నగదును అందజేశారు. గ్రామ ప్రజలకు ఎలాంటి ఆపదలోనైనా తాను తోడుగా ఉంటానని.

ఈ సందర్భంగా ఆయన. తెలిపారు ఆయనతోపాటు

లంజపెల్లి శ్రీకాంత్,లంజపల్లి శ్రీనివాస,శ్రీకాంత్,ఫిరోజ్,నిలమ్మ,వెంకటరమణ,లావణ్య,చారి అభిషేక్, లంజాపల్లి పరమేష్,ఉన్నారు.

# డిసెంబర్ 26న జరిగే సీపీఐ శతవార్షికోత్సవాలను జయప్రదం చేయాలి

- **అనేక ప్రజా కార్మిక పోరాటాలతో పునీతమైనది ఎర్రజెండా**
- **సీపీఐ నగర కార్యదర్శి కామ్రేడ్ కే. కనకరాజ్**

**పెద్దపల్లి బ్యూరో, డిసెంబర్ 24 (డిడి9 వార్త):**
అనేక ప్రజా, కార్మిక పోరాటాలతో పునీతమైనది ఎర్రజెండా అని సీపీఐ నగర కార్యదర్శి కామ్రేడ్ కే. కనకరాజ్ అన్నారు. డిసెంబర్ 26న సీపీఐ శతవార్షికోత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా వాడవాడల ఎర్రజెండాలు ఎగురవేసి ఉత్సవాలను జయప్రదం చేస్తున్నట్లు పేర్కొన్నారు. మార్క్సిజం-లెనినిజం ఆశయాలతో 1925లో భారతదేశంలో ఆవిర్భవించిన సీపీఐ, స్వాతంత్రోద్యమంలో కీలక పాత్ర పోషించడమే కాకుండా, నిజాం నవాబుకు వ్యతిరేకంగా తెలంగాణ సాయుధ పోరాటాన్ని నిర్వహించిన ఘనత కమ్యూనిస్టు పార్టీకే దక్కుతుందని ఆయన అన్నారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా వంద సంవత్సరాలుగా ప్రజల మధ్య ఉంటూ పేదల అభ్యున్నతికి అండగా నిలుస్తున్న జెండా ఎర్రజెండా అని పేర్కొన్నారు.




శతవార్షికోత్సవాల సందర్భంగా డిసెంబర్ 26న ఉదయం 10 గంటలకు స్థానిక భాస్కరరావు భవన్‌లో ఉత్సవాలు ప్రారంభమవుతాయని, అనంతరం భాస్కరరావు భవన్ నుంచి ఊరేగింపు నిర్వహించి ఉదయం 11 గంటలకు స్థానిక చౌరస్తాలో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీ నాయకులు, ప్రజాసంఘాల కార్యకర్తలు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని శతవార్షికోత్సవాలను విజయవంతం చేయాలని కామ్రేడ్ కనకరాజ్ పిలుపునిచ్చారు.



# బంగ్లా దాడులకు వ్యతిరేకంగా నిరసన ర్యాలీ

**మంథని, డిసెంబర్ 24 (డిడి 9 వార్త);**
బంగ్లాదేశ్ లో హిందువులపై దాడిని వ్యతిరేకిస్తూ విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. బుధవారం మంథని పట్టణంలో విశ్వహిందూ పరిషత్ పెద్దపెల్లి జిల్లా ఉపాధ్యక్షుడు కొత్త శ్రీనివాస్ ఆధ్వర్యంలో విశ్వహిందూ పరిషత్ సభ్యులు, భజరంగ్ దళ్ కార్యకర్తలు గాంధీ చౌక్ నుండి చౌరస్తా వరకు క్రోవత్తి నిర్వహించారు. బంగ్లా దాడులకు వ్యతిరేకంగా దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. అనంతరం కొత్త శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ.... బంగ్లాదేశ్ లో మైనార్టీలపై దాడి అమానుషమని, వెంటనే మైనార్టీలపై దాడి ఆపాలని డిమాండ్ చేశారు. హిందువులపై దాడి చేస్తే ఊరుకునేది లేదని తెలిపారు. దీపక్ దాస్ పైన జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వ హిందూ పరిషత్ మంథని ప్రఖండ బాధ్యులు రావుల సతీష్, విశ్వహిందూ పరిషత్ మంథని ప్రధాన కార్యదర్శి బత్తుల సత్యనారాయణ, సహాయ కార్యదర్శి నామిని నగేష్, భజరంగ్ దళ్ సంయోజక్ నరెడ్ల రాజేష్, సభ్యులు రాజమౌళి గౌడ్, తూర్పటి రాము, నరేందర్ రెడ్డి, సాయి, కేక్కర్ల అనిల్ కుమార్, గర్రెపల్లి వెంకటేశ్వర్లు, విశ్వహిందూ పరిషత్ సభ్యులు, భజరంగ్ దళ్ కార్యకర్తలు , తదితరులు పాల్గొన్నారు.

# రత్నాంజలి గ్రామైక్య సంఘంలో నగదు రహిత లావాదేవీలపై శిక్షణ

**గోవిందరావుపేట, డిసెంబర్ 24 డి డి 9 వార్త**
రత్నాంజలి గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో మహిళా సంఘ సభ్యులకు నగదు రహిత లావాదేవీలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సెర్ఫ్ నుంచి వచ్చిన సీఆర్పీలు హాజరై మహిళలకు డిజిటల్ లావాదేవీలపై విస్తృతంగా శిక్షణ అందించారు.

ఈ సమావేశంలో ఏపిఎం శ్రీలత, సీసీ మేడం శ్రీమతి సుహాసిని, గ్రామ సంఘం ఓబి అధ్యక్షురాలు మద్దినేని రేణుక, కార్యదర్శి సామ శారద, కోశాధికారి తీగల మంజుల పాల్గొన్నారు. అలాగే గ్రామంలోని 25 మహిళా సంఘాలకు చెందిన



సభ్యులు భారీ సంఖ్యలో హాజరయ్యారు.

సీఆర్పీలు మాట్లాడుతూ, వివో పరిధిలో ఉన్న అన్ని మహిళా సంఘాలు ఇకపై నగదు లావాదేవీలకు బదులుగా డిజిటల్ విధానాన్ని అనుసరించాలన్నారు. సభ్యురాలి మొబైల్ నంబర్, ఆధార్ నంబర్‌కు బ్యాంక్ ఖాతాను లింక్ చేసి, సంఘానికి సంబంధించిన లోన్ ఖాతా, పొదుపు ఖాతాలకు ప్రతి నెల చెల్లింపులు ఏటీఎం లేదా ఫోన్‌పే వంటి యాప్‌ల ద్వారా మాత్రమే చేయాలని సూచించారు. సంఘ సమావేశాల్లో నగదు చెల్లింపులు లేకుండా డిజిటల్ చెల్లింపులు అమలు చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ భూక్య సుమలత, ఉప సర్పంచ్ సప్పిడి సంజన, వార్డు సభ్యురాలు భూక్య భద్రమ్మ హాజరై మహిళలను నగదు రహిత లావాదేవీల వైపు ముందుకు నడిపించాలని ప్రోత్సహించారు.

డిజిటల్ లావాదేవీల ద్వారా పారదర్శకత పెరుగుతుందని, మహిళలకు ఆర్థిక భద్రత మరింత బలపడుతుందని వక్తలు పేర్కొన్నారు.



# అధైర్యపడవద్దు .... అండగా ఉంటా

- **ఓటమి గెలుపుకు పునాది అనుకోవాలి**
- **-మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్**

**మహాదేవపూర్ డిసెంబర్ 24 ( డిడి 9 వార్త )**
ప్రజాతీర్పును గౌరవించి ప్రజలకు అందుబాటులో ఉండాలే కానీ మనోధైర్యం కోల్పోవద్దని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ నాయకులు, కార్యకర్తలకు ధైర్యం చెప్పారు. బుధవారం సాయంత్రం మహదేవ్‌పూర్ మండల కేంద్రంలోని కేదారి గీత నివాసంలో నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. సర్పంచ్ ఎన్నికల్లో ఓటమితో ఏదో కోల్పోయామనే భావన ఉండవద్దని, ఓటమి గెలుపుకు పునాది అని ఆయన తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి బీఆర్ఎస్ కార్యకర్త, నాయకుడు సైనికుల్లా పనిచేశారని ఆయన కొనియాడారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ప్రజలను చైతన్యం చేయడంలో బాగస్వాములం కావాలన్నారు. ప్రజల గుండెల్లో గులాబీ జెండా చెరగని ముద్రలా ఉంటుందని, పరిస్థితుల కారణంగా ప్రజాతీర్పు మారుతుందన్నారు. అధైర్యపడవద్దని బీఆర్ఎస్ పార్టీ ఎల్లప్పుడు మనకు అండగా నిలుస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. ఈ సమావేశంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు జక్కు రాకేష్, మంథని నియోజకవర్గం మహిళా విభాగం ఇంచార్జి గీత, అరుణ, నాయకులు శ్రీపతి బాపు, మనోహర్, ప్రకాష్, దేవేందర్, అలీమ్, సల్మాన్, కుమార్, పెండ్యాల నర్సింహా స్వామి, ఇబ్రహీం తదితరులు ఉన్నారు.

# స్వచ్ఛ సర్వేక్షణ్–2025లో ఉత్తమ ర్యాంక్ లక్ష్యంగా రామగుండం నగరం

- **స్వచ్ఛ సర్వేక్షణ్–2025 మార్గదర్శకాలపై పవర్ పాయింట్ ద్వారా అవగాహన కార్యక్రమం**
- **సిబ్బంది సమిష్టి కృషితోనే మెరుగైన ర్యాంక్ సాధ్యమని కమిషనర్ జె. అరుణశ్రీ**

**పెద్దపల్లి బ్యూరో, డిసెంబర్ 24 (డిడి9 వార్త):**
స్వచ్ఛ సర్వేక్షణ్-2025లో రామగుండం నగరం ఉత్తమ ర్యాంక్ సాధించేందుకు సిబ్బంది సమిష్టిగా కృషి చేయాలని రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్, అడిషనల్ కలెక్టర్ (స్థానిక సంస్థలు) జె. అరుణశ్రీ అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మార్గదర్శకాలను వివరించారు. నివాస ప్రాంతాల్లో రోజుకు ఒకసారి, వాణిజ్య ప్రాంతాల్లో రెండుసార్లు శుభ్రత చర్యలు చేపట్టాలని, తడి-పొడి చెత్త వేర్వేరుగా సేకరించాలని సూచించారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో అధిక మార్కులు సేవా స్థాయి పురోగతికే కేటాయించబడినందున సేవల్లో లోపాలు లేకుండా పనిచేయాలని ఆమె సిబ్బందికి సూచించారు.





# ఎమ్మెల్యే పాయం ను సన్మానించిన నూతనంగా ఎన్నికైన ప్రజాప్రతినిధులు

**మణుగూరు.డిసెంబర్24 (డి డి 9వార్త)**
మణుగూరు పట్టణంలోని ప్రజా భవన్ ఎదురుగా గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్, ఉప సర్పంచ్, మరియు వార్డు సభ్యుల "అభినందన సభ" లో కార్యక్రమ అనంతరం పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ను శాలువా, మరియు పూలమాలలు వేసి ఘనంగా సత్కరించి ధన్యవాదాలు & కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో సమితి సింగారం మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ కలబోయిన మాధవరావు, ఉప సర్పంచ్ గాండ్ల. సురేష్ మరియు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ దొబ్బల వెంకటప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

# అథ్లెటిక్స్‌లో రాష్ట్రస్థాయిలో సత్తా చాటిన మట్టిలో మాణిక్యం

**మంగపేట, డిసెంబర్ 24డీడీ9 వార్త**

మంగపేట మండలం చెరుపల్లి గ్రామానికి చెందిన ఎదురుగట్ల రాజ్‌కుమార్ (తండ్రి: రామస్వామి) అథ్లెటిక్స్ క్రీడల్లో రాష్ట్రస్థాయిలో మెడల్స్ సాధించి పల్లెటూరి క్రీడాకారుడిగా ప్రత్యేక గుర్తింపు పొందాడు.

అథ్లెటిక్స్‌పై ఆసక్తితో గత ఐదేళ్లుగా కఠినమైన శిక్షణలు తీసుకుంటూ లక్ష్యసాధన దిశగా నిరంతరంగా శ్రమించిన రాజ్‌కుమార్, జిల్లాస్థాయిలో అనేక మెడల్స్ సాధించి, ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొని మెడల్స్ గెలుచుకున్నాడు. పల్లెటూరి మట్టిలో పుట్టిన ఈ యువ క్రీడాకారుడు తన ప్రతిభతో రాష్ట్రస్థాయిలో మాణిక్యంలా మెరిసి ప్రశంసలు అందుకుంటున్నాడు.



రాష్ట్రస్థాయి విజయాల అనంతరం స్వగ్రామమైన చెరుపల్లికి వచ్చిన రాజ్‌కుమార్, మంగపేట ఎస్సై సూరిని మర్యాదపూర్వకంగా కలిశాడు. ఆయన ప్రతిభను తెలుసుకున్న ఎస్సై సూరి రాజ్‌కుమార్‌ను అభినందిస్తూ, "యువతే దేశ ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసేది. క్రీడల ద్వారా ఎంతో మంది దేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకొస్తున్నారు. నువ్వు కూడా అథ్లెటిక్స్‌లో జాతీయస్థాయిలో రాణించి రాష్ట్రానికి పేరు తేవాలి" అని ఆకాంక్షించారు. తమ ప్రోత్సాహం ఎల్లవేళలా ఉంటుందని భరోసా ఇచ్చారు.

ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ, "అథ్లెటిక్స్‌పై నాకు ఉన్న ఆసక్తిని నాన్న గుర్తించి ప్రోత్సహించడమే ఈరోజు రాష్ట్రస్థాయిలో నిలిచేలా చేసింది. మా గ్రామస్తులు కూడా నిరంతరం నాపై నమ్మకం ఉంచి, 'నువ్వు సాధిస్తావు, మన ఊరికి పేరు తీసుకొస్తావు' అని ప్రోత్సహించడం నాకు మరింత ధైర్యం ఇచ్చింది. లక్ష్యం గొప్పదైతే, దాన్ని సాధించేందుకు కఠినమైన శిక్షణలు తప్పవు. ఆ క్రమంలోనే నేను ఎంతో శ్రమించి జిల్లా, రాష్ట్రస్థాయిలో మెడల్స్ సాధించాను. నా జీవిత లక్ష్యం ఒక్కటే - ఏదో ఒక రోజు దేశం తరపున అథ్లెటిక్స్‌లో ఒలింపిక్స్‌లో పాల్గొనడం. నా ప్రతిభను ప్రోత్సహించిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు" అని తెలిపారు.



# కమాన్ పూర్ నమస్తే తెలంగాణ సీనియర్ జర్నలిస్ట్ సాయి శంకర్‌కు కాంగ్రెస్ నాయకుల పరామర్శ

**మంథని, డిసెంబర్ 24(డిడి 9 వార్త):**

కమాన్ పూర్ కు చెందిన నమస్తే తెలంగాణ సీనియర్ జర్నలిస్ట్ సాయి శంకర్ ఇటీవల జరిగిన రోడ్ ప్రమాదంలో కాలు విరగడంతో కరీంనగర్‌లోని మెడికవర్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు హాస్పిటల్‌కు చేరుకుని సాయి శంకర్‌ను పరామర్శించారు.

ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్న నాయకులు, మెరుగైన వైద్యం అందించాలని కోరుతూ ధైర్యం చెప్పారు. సాయి శంకర్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

# ప్రపంచవ్యాప్తంగా శాంతిని చాటిన ఏసుప్రభు

- **పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క**

**డీ డీ 9 వార్త, ములుగు బ్యూరో :**

శాంతిని చాటిన ఏసు ప్రభువు ఆశీర్వాదం అందరి పైన ఉండాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క ఆకాంక్షించారు. ములుగు జిల్లా అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ములుగు జిల్లా కేంద్రంలోని డి ఎల్ ఆర్ గార్డెన్ లో బుదవారం నిర్వహించిన క్రిస్టమస్ సెలబ్రేషన్స్2025 వేడుకలకు ముఖ్యఅతిథిగా రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క హాజరై కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఈ వేడుకలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మన మతాన్ని మనం అనుసరిస్తూ పరమతాన్ని కించపరచకుండా గౌరవించుకోవాలని అన్నారు. క్రిస్మస్ వేడుకల్లో పాల్గొనడం చాలా సంతోషమని, ఏసుక్రీస్తు జన్మదినాన్ని పురస్కరించుకుని జరుపుకునే క్రిస్మస్ పండుగ క్రైస్తవులకు అత్యంత పవిత్రమైన పండుగని అన్నారు. ఏసుక్రీస్తు బోధనలు ప్రతి ఒక్కరికీ ఆదర్శప్రాయమని, ప్రేమను పంచుకోవడం, సేవాభావంతో మానవత్వాన్ని కాపాడుకోవడం ఎలా అన్న విషయాలను క్రీస్తు బోధనలు తెలియచేస్తాయని తెలిపారు. జిల్లా ప్రజలంతా క్రిస్మస్ పండుగను ఘనంగా జరుపుకోవాలని, పరస్పర సౌహార్దంతో, శాంతియుత వాతావరణంలో వేడుకలు నిర్వహించాలని సూచించారు. ములుగు జిల్లా వ్యాప్తంగా ఉన్న క్రిస్టియన్ మతానికి చెందిన వారికి, జిల్లా ప్రజలకు క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ములుగు జిల్లా క్రిస్టియన్ సంఘం వారు తెలిపిన సమస్యలు పరిష్కరిస్తామని వారు అడిగిన చర్చిల మరమ్మత్తు నిర్మాణాలకు ప్రహరీ నిర్మాణాలకు ప్రభుత్వపరంగా అండగా ఉంటామని తెలిపారు.



అనంతరం ములుగు జిల్లా కేంద్రంలో ఆర్ అండ్ బి కార్యాలయ ప్రాంగణంలో కోటి 50 లక్షల రూపాయలతో వెజ్, నాన్ వెజ్ మార్కెట్ నిర్మాణం పనులకు రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, ములుగు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కల్యాణి, పంచాయతీ రాజ్ శాఖ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి, , ఆత్మ కమిటీ చైర్మన్ కొండం రవీందర్ రెడ్డి, మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ సర్దార్ సింగ్, పంచాయతీ రాజ్ ఈ ఈ అజయ్ కుమార్, ఆయా మండలాల పాస్టర్లు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ముక్కోటి యాత్రికులకు ఇబ్బంది కలగనివ్వద్దు

- **నిర్దేశించిన ఛార్జీలే వసూలు చేయాలి**
- **ఆటో డ్రైవర్లకు భద్రాచలం ఎంవీఐ వెంకటప్పయ్య ఆదేశం**

**భద్రాచలం, డిసెంబర్ 24 (డిడి9 వార్త )**

భద్రాచలంకు ఈ నెల 28, 29, 30 తేదీల్లో ముక్కోటి యాత్రికుల నుంచి భద్రాచలం ఆటో యూనియన్ డ్రైవర్లు నిర్దేశించిన రేట్లను మాత్రమే వసూలు చేయాలని భద్రాచలం మోటారు వెహికిల్ ఇన్స్ పెక్టర్ సంఘం వెంకటప్పయ్య పేర్కొన్నారు. భద్రాచలంలో బుధవారం ఎంవిఐ కార్యాయలంలో ఇందుకు సంబంధించిన ధరల పట్టిను ఆటో డ్రైవర్లకు ఎంవిఐ, అసిస్టెంటు ఎంవిఐ రాజశేఖర్‌రెడ్డిలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భద్రాచలం రామయ్య దర్శనంకు వచ్చే యాత్రికులతో ఆటో డ్రైవర్లు మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని, వారిని సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని కోరారు. నిర్దేశించిన ధరలను మాత్రమే వసూలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కాలేజీ అధ్యాపకులు కామేశ్వరరావు, ఈవో తిరుపతి పాల్గొన్నారు.



# గిరిజన సంస్కృతికి జీవం పోస్తున్న ట్రైబల్ మ్యూజియం

- **ఐటీడీఏ మ్యూజియాన్ని సందర్శించిన కోమల పాఠశాల, గురుకుల కళాశాల విద్యార్థులు**
- **గిరిజన మ్యూజియంను సందర్శించిన 550 మంది విద్యార్థులు**

**భద్రాచలం, డిసెంబర్ 24 ( డిడి9 వార్త )**

ఐటిడిఏ ప్రాంగణంలోని ట్రైబల్ మ్యూజియంను భద్రాచలంలోని కోమల హైస్కూల్, పాల్వంచలోని సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల బాల బాలికలు 550 మంది మరియు 12 మంది ఉపాధ్యాయునీలు సందర్శించి మ్యూజియంలో పొందుపరిచిన గిరిజనుల అన్ని కళాఖండాలను క్లుప్తంగా తిలకించి చిన్నపిల్లలు సరదాగా మ్యూజియం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన క్రీడాస్థలంలో ఆటలు ఆడుకున్న అనంతరం ప్రిన్సిపాల్ లు మాట్లాడుతూ అంతరించిపోతున్న గిరిజన సంస్కృతి సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు నేటితరం బాల బాలికలకు తెలిసే విధంగా కళాఖండాలు ఏర్పాటు చేయడంతో పాటు వాటి యొక్క చరిత్రను విద్యార్థులకు అర్థమయ్యే విధంగా తెలుగులో ముద్రించి ప్రదర్శించడం వలన విద్యార్థులకు పూర్తిస్థాయిలో అవగతమైందని, మ్యూజియంలో మాత్రం గిరిజనులకు సంబంధించిన స్పష్టమైన సమాచారం విద్యార్థులకు తెలిసే విధంగా మ్యూజియం నిర్వహకులు ప్రతి అంశం తెలియజేయడం చాలా బాగుందని అన్నారు. పాఠశాల, కళాశాలలకు మ్యూజియం సందర్శనకు ప్రత్యేక ప్యాకేజీ ద్వారా అవకాశం కల్పించి విద్యార్థిని, విద్యార్థులకు ఆటవీడుపుగా ఇటువంటి సందేశాలు ఉన్న గిరిజన కళాఖండాలు చూపెట్టడం వలన వారిలో మేధాశక్తి పెరిగి గిరిజన సంస్కృతి సాంప్రదాయాల గురించి పూర్తిస్థాయిలో తెలుసుకుంటారని అలాగే పాతతరం గిరిజనులు వాడే పనిముట్లు, ఆదివాసి గిరిజనుల సంస్కృతి భాష మరియు గిరిజనుల వేషధారణ కనుమరుగు కాకుండా కోయ భాషను పి ఓ రాహుల్ నేర్చుకొని భాష యొక్క అంతర్యాన్ని గిరిజనులు మరిచిపోకుండా అందరూ ఆచరించే విధంగా ఆయన చేస్తున్న కృషికి మా పాఠశాల తరపున ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ఆయన అన్నారు. అలాగే మ్యూజియం ప్రాంగణంలో చిన్నారుల కోసం ఏర్పాటుచేసిన బోటింగ్ పాయింట్, సెల్ఫీ పాయింటు, పాతకాలపు ఇండ్లు చూడముచ్చటగా ఉన్నాయని, చిన్నపిల్లల కోసం ఏర్పాటుచేసిన క్రీడాస్థలం చాలా బాగుందని అన్నారు. ఈ కార్యక్రమంలో లెక్చరర్లు సంధ్యారాణి, ప్రసన్న, పావని, రమాదేవి, వీణ, ఉపాధ్యాయినీలు వరలక్ష్మి, రేవతి, మోహిని, ఊర్మిళ, స్వప్నప్రియ, నాగమణి మ్యూజియం నిర్వహకులు వీరాస్వామి, మాధవి, చలపతిరావు మరియు విద్యార్థినీ విద్యార్థులు, బాల బాలికలు తదితరులు పాల్గొన్నారు.





# మేడారంలో పోలీసు కమీషనర్ మొక్కులు..!!

- ములుగు నుంచి పస్రా తాడ్వా యి,మీదుగా జాతర సందర్శన
- గద్దెల పనుల పరశీలన, చరిత్ర కట్టడాలు బాగున్నాయి,,
- ఆదివాసి సంప్రదాయం సంస్క్రు తి ఎంతొ బాగుంది,,
- సమ్మక్క- సారలమ్మలకు పూజలు,,

**ఏటూరునాగారం క్రైం**
**డిడి9 వార్త డిశంబర్ 24**

మేడారాన్ని వరంగల్ పోలీసుకమీషనర్ సన్ ప్రీత్ సింగ్ బుధవారం సందర్శించారు ములుగు జిల్లా ఎస్పి కేకన్ ఆద్వర్వర్యంలొ పర్యటించారు, అధికారులు, పూజారులు కమిషనర్ కు స్వాగతం పలికారు సమ్మక్క సారలమ్మ దేవతలను దర్శించుకుని మొక్కులు సమర్పించారు దేవాదాయ అధికారులు సి పి కి శాలువతొ సన్మానించి దేవతల ప్రసాదాన్ని హమర్పించారు గద్దెలప్రాంగణంలొ జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరశీలించారు ఈరాతికట్టడాలు ఎంతొబాగున్నాయన్నారు ఆదివాసి సంప్రదాయలు, సంస్క్రుతి ఉట్టిపడే విధంగా రూపొందించడం బాగుందన్నారు, ఇదంతా ప్రభుత్వం చేపట్టిన పనులే అన్నారు వచ్చే ఏడాది జనవరిలొ జరిగె ఈపండుగ ముదురోజుల పాటునిర్వహిస్తారన్నారు ప్రపంచ వ్యాప్తంగా వస్తారని ఎస్పితెలిపారు, ములుగు నుంచి మేడారానికి భద్రతా చర్యలు ఏవిధంగా చేపట్టారని తెల్సుకున్నారు గతంలో కంటె ఈసారి పకడ్బందిగా భద్రత ఉంటుందని బారీ ఎత్తునబలగాలను మోహరిస్తున్నట్లు ఎస్పితెలిపారు మేడారం లోని పోలీసు కమాండ్ కంట్రోల్ రుంను సందర్సించారు అన్ని విషయాలు సిబ్బిందిని అడిగితెల్సుకున్నారు ములుగు డి ఎస్పి,ఏటూరునాగారం ఎ ఎస్పి ,మిగతా పోలీసు అదికారులు

# మేడారానికికోట్లు.. కన్నెపెల్లికిపాట్లు..!!

- కన్నెపెల్లి అభివృద్ధికి కృషి చేస్తా,
- సారలమ్మ గుడి ,మరుగుదొడ్లు మరమ్మత్తులు లేవు,,
- భక్తుల సౌకర్యాల పై పట్టింపే లేదు,,
- ఎంతొ కాలంగా వీధిలైట్లు లేక చీకటె,,
- మంత్రి సీతక్క కు మొరపెట్టు కున్నగ్రామస్తులు,,,

**ఏటూరునాగారం క్రైం**
**డిడి9 వార్త డిశంబర్ 24**

మేడారం అభివృద్ధికి కోట్లు వెచ్చించుతున్నారు, సాలమ్మ కొలువుదీరిన కన్నెపెల్లిలొ సమస్యలతొ పాట్లు నెలకొన్నాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఎండ్లుగా సారలమ్మ కొలువుదీరిన ఈగ్రామాన్నె పట్టించుకోవడం మరచిపోయారని అన్నారు సారలమ్మ సన్నిదిలొ గుడి బాగాలేదన్నారు ,పై కప్పుశిథిలావస్థలొ ఉంది వర్షంనీల్లన్ని కురుస్తున్నాయి, భక్తులువస్తె మరుగుదొడ్లు పనిచేయడం లేదు ఇబ్బందులు పడుతున్నారు, తాగునీరు లేదు,వీదిలైట్లులేక భక్తులు వస్తెచీకట్లోనె ఉండవలసి వస్తుందన్నారు ఈసమస్యలన్ని విన్నాక సీతక్క స్పందించారు ఈ జాతర లోపలనె పనులు చేపిస్తాన్నారు మారుమూలన ఉందని సారలమ్మ ఉన్న



ఈఊరిలో సమస్యలపై సవతి తల్లిదండ్రులను చూపుతున్నారని తెలిపారు,ఎట్టకేలకు సి సి రోడ్డుకు నిర్మించారు దేవాదాయ శాఖ అధికారులైతె కన్నెపెల్లి గ్రామాన్ని సందర్సించిన దాఖలాలు లేవన్నారు జాతర సమయంలోనే ఇటువైపుగా వచ్చిన దాఖలాలు లేవన్నారు అధికారుల దృష్టికి తీసుకెల్లి గ్రామాన్ని సందర్శించమని ఆదేశిస్తానని తెలిపారు గ్రామంలోని మహిళలు, పూజారులు, తదితరులు

# వణుకుతున్న తెలంగాణ.. ముసురుతున్న రోగాలు!

- రాష్ట్రంలో దారుణంగా పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- వాతావరణ మార్పులతో స్వైర విహారం చేస్తున్నవైరస్‌లు
- జలుబు, దగ్గు, ఒళ్లు నొప్పులతో బాధపడుతున్నప్రజలు
- మరికొన్ని రోజులు ఇదే పరిస్థితి ఉంటుందన్న వాతావరణశాఖ
- జాగ్రత్తగా ఉండాలంటున్న వైద్య నిపుణులు

**మంథని, డిసెంబర్ 24 (డిడి 9 వార్త);**

తెలంగాణను చలిపులి వణికిస్తోంది. భానుడి భగభగలు మాయమై.. ఎముకలు కొరికే చలి పంజా విసురుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉష్ణోగ్రతలు కనిష్ఠ స్థాయికి పడిపోవడంతో 'చలి జ్వరం' ఇంటింటినీ పలకరిస్తోంది. వాతావరణంలో ఒక్కసారిగా వచ్చిన ఈ మార్పులతో వైరస్‌లు స్వైరవిహారం చేస్తున్నాయి. ఫలితంగా ప్రతి ఇంటా జలుబు, దగ్గు, ఒళ్లు నొప్పుల బాధితులు కనిపిస్తున్నారు. రానున్న మరి కొన్ని రోజులు ఇదే పరిస్థితి కొనసాగుతుందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది.

సాధారణంగా మన శరీర ఉష్ణోగ్రతను మెదడులోని 'హైపోథాలమస్' గ్రంథి నియంత్రిస్తుంది. అయితే, బయట ఉష్ణోగ్రతలు 15 డిగ్రీల కంటే తక్కువకు పడిపోతే శరీరంలోని ఉష్ణ నియంత్రణ వ్యవస్థపై తీవ్ర ఒత్తిడి పడుతుంది. ప్రస్తుతం రాష్ట్రంలో పలుచోట్ల ఉష్ణోగ్రతలు 5 నుంచి 13 డిగ్రీల మధ్యే రికార్డవుతుండటంతో బాడీ మెకానిజం దెబ్బతినే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. దీనివల్ల రక్తనాళాలు కుంచించుకుపోయి బీపీ పెరగడం, తద్వారా గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్ వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి.

చలి నుంచి ఉపశమనం కోసం 'రెండు పెగ్గులు' వేయడం పరిష్కారం కాదని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. మద్యం తాగేటప్పుడు రక్తనాళాలు వ్యాకోచించి శరీరానికి తాత్కాలికంగా వెచ్చదనం లభించినప్పటికీ, ఆ తర్వాత ఉష్ణోగ్రతలు అకస్మాత్తుగా పడిపోతే, అది 'హైపోథెర్మియా' వంటి ప్రాణాంతక స్థితికి దారితీసే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. రోజంతా గోరువెచ్చని నీటినే తాగాలని, ఇది గొంతు సమస్యలను దూరం చేయడమే కాకుండా శరీర ఉష్ణోగ్రతను స్థిరంగా ఉంచుతుందని చెబుతున్నారు.



బయటకు వెళ్లేటప్పుడు స్వెట్టర్లు, మఫ్లర్లు, గ్లౌజులు తప్పనిసరిగా ఉపయోగించాలని, ముఖ్యంగా ముక్కు, చెవుల ద్వారా చలి గాలి లోపలికి వెళ్లకుండా జాగ్రత్త పడాలని పేర్కొన్నారు. శ్వాసకోశ సమస్యలున్న వారు రోజుకు రెండుసార్లు ఆవిరి పడితే ఊపిరితిత్తులకు ఉపశమనం లభిస్తుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. రోగ నిరోధక శక్తిని పెంచుకోవడానికి తాజా ఆకుకూరలు, పండ్లు, ప్రోటీన్లతో కూడిన ఆహారం తీసుకోవాలని సూచిస్తున్నారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నారులు, ఆస్తమా రోగులు ఈ సమయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని, తెల్లవారుజామున, అర్ధరాత్రి వేళల్లో ప్రయాణాలు మానుకోవడం ఉత్తమమని, చలి తీవ్రత పెరిగే కొద్దీ బ్యాక్టీరియా విజృంభణ కూడా పెరుగుతుంది కాబట్టి స్వల్ప లక్షణాలు కనిపించినా నిర్లక్ష్యం చేయవద్దని నిపుణులు సూచిస్తున్నారు.

# వామన రూపుడైన వరాల రామయ్య

- భద్రగిరిలో వైభవోపేతంగా సాగుతున్న అధ్యయనోత్సవాలు
- నేడు పరశురామావతారంలో దర్శనం

**భద్రాచలం, డిసెంబర్ 24 ( డిడి9 వార్త )**

బలి చక్రవర్తి గర్వాన్ని అణిచేందుకు వెలసి మూడడుగుల స్థలాన్ని కోరి రాక్షసరాజుకు గర్వభంగం చేసిన వామనావతారంలో దర్శన మిచ్చిన భద్రాద్రి రామయ్యకు భక్తులు జేజేలు పలికారు. భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో నిర్వహిస్తున్నవైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాలు బుధవారం ఐదో రోజుకు చేరుకున్నాయి. ఇందులో భాగంగా సీతాలక్ష్మణ సమేతుడైన రామయ్య స్వామిని వామనావ తారంలో అలంకరించారు. తొలుత గర్భగుడిలో సుప్రభాత సేవ నిర్వహించి ఆరాధన గావించారు.. అర్చక స్వాములు పూజల నడుమ వేద పండితులు పాశురముల ప్రబంధాలను పం చారు. వామనావతారంలో అలంకరించిన స్వామి వారికి బేడా మండపంలో పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం నుంచి ఊరేగింపుగా మహిళ లు కోలాట ప్రదర్శనల నడుమ మిథిలా స్టేడియానికి తీసుకొచ్చారు. ప్రత్యేక వేదికపై కొలువుదీరిన స్వామివారిని దర్శించుకున్న భక్తులు నీరాజనాలు పలికారు. ఆర్చకులు ఆశీర్వచనాలు అందజేసి ప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం వామనావతారంలో దర్శనమిస్తున్న స్వామివారు, పక్కన ఆళ్వార్లు స్వామివారికి తిరువీధి సేవ జరిపి తిరిగి ఆలయా నికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమాల్లో దేవస్థానం ఈవో కె.దామోదర్‌రావు, ఏఈవో శ్రావణ్‌కుమార్, ఆలయ పర్యవేక్షకులు లింగాల సాయిబాబా, వైదిక పరిపాలన సిబ్బంది పాల్గొన్నారు.

**నేడు పరశురాముడిగా..**

వైకుంఠ ఏకాదశి ఉత్సవాల్లో భాగంగా స్వామివారు గురువారం పరశురామావతారం లో భక్తులకు దర్శనమివ్వనున్నారు. శ్రీ మహావిష్ణువు జమదగ్ని అనే మహర్షికి పుత్రుడి గా జన్మించి పరశురాముడు (భార్గవరాముడు) అని పిలవబడుతూ దుష్టులైన కార్తవీర్యార్జు నుని, దుర్మార్గులైన రాజులను 21 సార్లు దండెత్తి సంహరించి ధర్మాన్ని స్థాపించాడు. శుక్రగ్రహ బాధలున్నవారు ఈ అవతారాన్ని దర్శిస్తే శుభ ఫలితాలు పొందుతారని ప్రతీతి.



